Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 05.04.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 44 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## అనుభవమా..
# ఓటమి భయమా?



- బాబులోని అపనమ్మకాన్ని ప్రస్ఫుటం చేస్తున్న ప్రసంగాలు
- స్థాయిని మరచి ప్రత్యర్థులపై అనుచిత విమర్శలు
- చేసిన పనుల చెప్పకోలేకే ప్రాంతీయ విద్వేషాలు

*"నాకు పదవి పోయినా ఏం బాధ లేదు... మా మిస్సెస్ వుంది, కొడుకున్నాడు, కోడలుంది, మనుమడు కూడా వున్నాడు. నరేంద్ర మోడీకి ఎవరున్నారు."*

*"తమ్ముళ్ళూ నా భద్రత మీ బాధ్యత, నేను జైలుకు పోకుండా వుండాలంటే మీరంతా నాకు ఓట్లేసి గెలిపించాలి."*

*"మీకు సిగ్గుందా... రోషముందా? మీకు పౌరుషం లేదా? జగన్‌కు ఓటేస్తే నరేంద్ర మోడీకి వేసినట్లే! వైసిపిని గెలిపిస్తే మన రాష్ట్రంపై కేసీఆర్ పెత్తనం చేస్తాడు..."*

2019 ఎన్నికల ప్రచార సభలలో నవ్యాంధ్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత, 40ఏళ్ళ రాజకీయ అనుభవముందని చెప్పుకునే ఆదర్శవంతమైన నాయకుడు శ్రీమాన్ చంద్రబాబునాయుడు గారు చెబుతున్న సుభాషితాలు. ఆయన చెబుతున్న వాటిలో ఇవి కొన్నే... ఇలాంటివి ఇంకా కోకొల్లలుగా దొర్లుతున్నాయి.

ధైర్యమున్న పరిపాలకుడెవడైనా ఐదేళ్ళ పాలన ముగిసిన తర్వాత జరుగుతున్న ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటేయమనాలి. తన స్వచ్ఛమైన పాలన చూసి ఓటేయమనాలి. లేదంటే ప్రతిపక్షంలోని లోపాలను ఎత్తి చూపి కూడా ఓటడగవచ్చు. ఇంతవరకు దేశ రాజకీయాలలో ఏ జాతీయ, ప్రాంతీయ పార్టీ నాయకులైనా చేసిందిదే! ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ తన ఐదేళ్ళ పాలన మీదే ప్రజల తీర్పును కోరుతున్నాడు. 2009లో తన పరిపాలన మీదే దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రజాతీర్పు కోరాడు.

చంద్రబాబు ఇప్పుడు అది చేయడం లేదు. తన ఐదేళ్ళ పాలనను ప్రజల ముందుకు తీసుకుపోయి ఓట్లడిగే ధైర్యం చేయడం లేదు. ఎన్నికల ప్రచార సభలలో ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చి మాట్లాడు తున్నాడు. కోడికత్తి పార్టీ అంటూ (మిగతా 10వ పేజీలో)






## పవనే..
# ముంచబోతున్నాడా?

- వికటిస్తున్న ఓట్ల చీలిక వ్యూహం
- పవన్‌తో పొత్తున్నా... కొంచెం ఉపయోగముండేదేమో?!

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ప్రయోగించిన పాశుపతాస్త్రం జనసేన పవన్ కళ్యాణ్. 2014 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ద్వారా ప్రత్యక్ష లబ్ధి పొందాడు చంద్రబాబు. (మిగతా 10వ పేజీలో)



## తల్లి.. చెల్లి...
# మధ్యలో జగన్

- ఏపిలోని ప్రతి గడపకు వై.యస్.కుటుంబసభ్యుల విన్నపం
- తమ ప్రచారంతో పార్టీకి ఊపు పెంచిన విజయమ్మ, షర్మిల

**తల్లి... కొడుకు... చెల్లి... రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో దుమ్ము దులుపుతున్న కుటుంబం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు చుక్కలు చూపిస్తున్న కుటుంబం... అదే వై.యస్. కుటుంబం.**

వైసిపి అధినేతగా ఓ పక్క వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సుడిగాలి ప్రచారం... ఇంకో పక్క ఆయన తల్లిగా నా బిడ్డకు ఒక అవకాశమిచ్చి మీ రాజన్న రాజ్యం తీసుకుని రాండంటూ వై.యస్.విజయమ్మ ప్రచారం... మరోపక్క జగన్ సోదరిగా తన అన్నకు చేయూతగా... "ప్రజాతీర్పు... బైబై బాబు" అంటూ షర్మిల ఇస్తున్న పిలుపులు... తెలుగుదేశం శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రజల స్పందనలో ఈ ముగ్గురూ ఒకరికొకరు తీసిపోవడం లేదు. (మిగతా 2వ పేజీలో)



# మీ విజయంలో... మేము సైతం!



గురువారం ఉదయం వైయస్సార్సీపీ పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు ప్రచారానికి బయలుదేరబోయే ముందు హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో ఆయన్ను కలిసి అభినందిస్తున్న 'నాటా' ఎలక్ట్ ప్రెసిడెంట్ కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి. నవ్యాంధ్రలో పార్టీ విజయఢంకా మోగించి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవలందించాలని అమెరికాలో వున్న ప్రతి తెలుగు పౌరుడు ఆకాంక్షిస్తున్నట్లుగా ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి జగన్మోహన్‌రెడ్డికి తెలియజేశాడు.

# వైసిపిలోకి కావ్య కృష్ణారెడ్డి



విపిఆర్, ఆదాల సమక్షంలో వైసిపిలో చేరిన కావ్య కృష్ణారెడ్డి, ఆయన అనుచరులు

తెలుగుదేశం నాయకులు, జలదంకి మాజీ ఎంపీపీ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) ఈ నెల 4వ తేదీన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిల సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు జమ్ములపాలెం సర్పంచ్ నక్కా మాధవరావు, పులిమి బాబులు, మస్తాన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు వైసిపిలో చేరారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో సొంత బలగం, బంధుత్వం వున్న కావ్య కృష్ణారెడ్డి ఈ ఎన్నికల్లో ఉదయగిరి అసెంబ్లీ తెలుగుదేశం టిక్కెట్‌ను ఆశించాడు. గత కొన్ని నెలలుగా కావ్య ఛారిటబుల్ ట్రస్టు ద్వారా కోట్ల రూపాయల సొంత నిధులతో ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించాడు. ఈ ఎన్నికల్లో ఉదయగిరి నుండి పోటీ చేయాలన్న ఆయన కలలకు చంద్రబాబు గండి కొట్టాడు. ఈ నేపథ్యంలోనే ఆయన తన సేవలను వాడుకుని వదిలేసిన టిడిపిలో ఉండలేక వైసిపిలో చేరాడు. ఆయన రాకతో ఉదయగిరి, కావలిలలో వైసిపి ఇంకొంచెం బలం పెరిగినట్లే!

# ఇంటింటికి.. ఆర్‌ఎస్‌ఆర్



21వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రావు శ్రీనివాసరావు

నెల్లూరు లోక్‌సభ, నెల్లూరురూరల్ శాసనసభ స్థానాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నెల్లూరు 21వ డివిజన్‌లోని వనంతోపు, దొరతోట, స్నేహనగర్, గెజిటెడ్ లే అవుట్‌లలో స్థానిక వైసిపి నాయకులు రావు శ్రీనివాసరావు విస్తృతంగా ప్రచారం నిర్వహించాడు. అపార్ట్‌మెంట్లు, నివాస గృహాలకు వెళ్ళి ప్రతిఒక్కరినీ పలుకరించి ఓటడిగాడు. ఈ ప్రచారంలో ఆయన వెంట వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, రాంబాబు, అశోక్, రూపేష్, శేఖర్, సురేష్, అన్వర్, వెంకటేష్, ఉషాశంకరమ్మ, భవాని, ఇంద్రజ, సాయిప్రియ, చంద్రమ్మ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అనిల్ వ్యాఖ్యలపై మార్ఫింగ్ కలకలం

■ ఖండించిన అనిల్ ■ ఎన్నికల అధికారికి ఫిర్యాదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

2018 జనవరి నెలలో నెల్లూరు టౌన్‌హాల్‌లో వైసిపి యువజన సదస్సు జరిగింది. నగరి ఎమ్మెల్యే ఆర్.కె.రోజా ఆ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొంది. ఆ సభలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య జరిగే యుద్ధంలో సైనికుల ముందు విజయమా, వీర స్వర్గమా అనే పరిస్థితి వుంటుంది. రేపటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైనికులుగా మన పరిస్థితి కూడా చంపడమా.. చావడమా అన్నట్లుగా వుంటుంది. పార్టీ గెలుపు కోసం వీరసైనికులుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సదస్సు జరిగి 16 నెలలైంది. ప్రసంగించిన రోజు ఎలాంటి విమర్శలు లేవు. వివాదాలు లేవు. అతని పూర్తి ప్రసంగాన్ని విన్నవాళ్లెవరు కూడా అందులోని అర్థాన్ని తప్పుబట్టరు.

కాని, ఈ ఎన్నికల వేళ ప్రత్యర్థులు ఆనాటి అనిల్ ప్రసంగం వీడియో కాపీని ఓ ఛానల్ వారి ద్వారా సేకరించారు. అనిల్ పూర్తి ప్రసంగాన్ని వదిలేసి... "ఎన్నికల కురుక్షేత్రంలో చావడమా... చంపడమా..." అనే మాటలనే కట్ చేసి తెలుగుదేశం పార్టీ ఒక ఛానెల్‌కు అందించారు. వాళ్ళు దానిని ఈ ఎన్నికల ప్రచార సభలలో మాట్లాడినట్లు దుష్ప్రచారం మొదలుపెట్టారు. సోషల్ మీడియాలోనూ దీనిని వైరల్ చేశారు.

జరిగిన సంఘటనపై అనిల్ స్పందించాడు. మార్ఫింగ్ వీడియో, అబద్ధపు ప్రచారాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. 2వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొడ్డిదారిన మంత్రయిన నారాయణ, ఈ ఎన్నికలలో గెలుపు కోసం దొడ్డిదారులు వెదుకుతున్నారని విమర్శించాడు. ఓటమి భయంతో నారాయణ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించాడు. నిజాయితీగా రాజకీయాలు చేస్తే గెలుపోటములను ప్రజలే నిర్ణయిస్తారని ఆయన పేర్కొన్నాడు. నారాయణ కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే ఆ పక్కనే వున్న నారాయణ కనీసం అక్కడకు వెళ్లి పరామర్శించిన దాఖలాలు లేవని, ఇలాంటి మానవత్వం లేని మనిషి తనపై బురద చల్లడం వింతగా వుందన్నారు. నేను నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నానని, ఈ విషయాన్ని నా కుటుంబసభ్యులపై ప్రమాణం చేసి చెప్పగలనని.. మరి తాను నిజాయితీ రాజకీయాలు చేస్తున్నానని నారాయణ ప్రమాణం చేసి చెప్పగలడా అని అనిల్ ప్రశ్నించాడు.

# రాహుల్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా

– పిసిసి అధ్యక్షుడు రఘువీరా



నెల్లూరు రోడ్‌షోలో పాల్గొన్న రఘువీరారెడ్డి, పక్కన ప్రసంగిస్తున్న చేవూరు దేవకుమార్‌రెడ్డి

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని, రాహుల్ ప్రధాని అయితేనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యమని పిసిసి అధ్యక్షుడు రఘువీరా ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 3న నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు దేవకుమార్‌రెడ్డి నిర్వహించిన రోడ్‌షోలో రఘువీరా పాల్గొని మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఘనవిజయం సాధించిపెట్టాలని కోరారు. జిల్లాలో కాంగ్రెస్ ఆశీస్సులతో నాయకులుగా ఎదిగి పదవులు అనుభవించి, ఆ తర్వాత స్వార్థంతో పార్టీలు మారే నాయకుల వల్ల కాంగ్రెస్‌పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని, జిల్లాలో గత 39 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ, విలువలతో కూడిన రాజకీయాలతో పనిచేస్తున్న నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు దేవకుమార్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. చేవూరుకు ఓటేస్తే అది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి వేసినట్లేనన్నారు. ఆంధ్రరాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామి కావాలంటే రాహుల్ గాంధీని గెలిపించాలన్నారు. దేశంలోని ప్రతి పేద కుటుంబానికి నెలకు 6వేల వంతున ఏడాదికి 72వేల రూపాయలు లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసి పేదరికాన్ని నిర్మూలించడమే రాహుల్ గాంధీ లక్ష్యమని, అదే కాంగ్రెస్‌పార్టీ ధ్యేయమని అన్నారు.

చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేసిన ఘనత నెహ్రూ కుటుంబానిదని, కాంగ్రెస్‌లో మరో ఇందిరమ్మ శకం ప్రారంభమైందని అంటూ ప్రియాంకగాంధీ రాకను ఆహ్వానిస్తూ ప్రజలు, ఉత్తర భారతదేశమంతా కాంగ్రెస్‌పార్టీ విజయాన్ని ఆకాంక్షిస్తోందన్నారు. అల్లర్లను, ఘర్షణలను ప్రేరేపించే బిజెపి, తెదేపాల నీచరాజకీయాలను తరిమికొట్టి దక్షిణ భారతదేశంలోనూ కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ, ఎంపి స్థానాల్లో నిలచిన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు అఖండవిజయం చేకూర్చాలని విజ్ఞప్తిచేశారు.

# తల్లి.. చెల్లి... మధ్యలో జగన్

(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురి సభలకు కూడా జనం తండోపతండాలుగా వస్తున్నారు. వారి ప్రసంగాలకు సైతం విశేష స్పందన వస్తోంది. ప్రతిరోజూ ముగ్గురూ మూడు జిల్లాల్లో పర్యటనలు సాగిస్తూ... రాష్ట్రం అంతటా కూడా వైసిపి కేడర్‌ను ఉత్సాహపరుస్తున్నారు. ప్రతిరోజూ నాలుగు సభలకు తగ్గకుండా నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో జగన్ ప్రచారానికి, జగన్ చేస్తున్న పోరాటానికి, తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలమ్మలు కొండంత అండగా నిలిచారని చెప్పవచ్చు. కాని, ఇక్కడ చంద్రబాబుకు ఆ ఛాన్స్ లేకుండా పోయింది. భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణిలు ప్రచారానికి రారు. కొడుకు లోకేష్ వుంటే మంగళగిరిలో దింపాడు. లోకేష్ రాష్ట్రంలో తిరిగి ప్రచారం చేసినా పార్టీకి అంతగా ఒరిగేదేమీ వుండదు. అభ్యర్థులు కూడా ఆయన ప్రచారాన్ని ఇష్టపడరు. చంద్రబాబు ఒక్కడే పార్టీ ప్రచారకర్త. ఆయన ఫరూక్ అబ్దుల్లా, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ లాంటి జాతీయ నాయకులను ప్రచారానికి తీసుకొచ్చాడు. వీళ్ళ వల్ల తెలుగుదేశంకు అదనంగా నాలుగు ఓట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రచారంలో పచ్చ మీడియా చంద్రబాబుకు పూర్తి అండగా వుంది. కొన్ని పత్రికలు, ఛానెల్స్ అయితే తెలుగుదేశం జెండాను తమ సంస్థల 'లోగో'ల స్థానంలో పెట్టుకోలేదన్న మాటేగాని అవి చంద్రబాబు కోసం పార్టీ ఏజెన్సీలలాగే ప్రచారం చేస్తున్నాయి. అయితే వీళ్ళ ప్రచారమంతా కూడా వైయస్ కుటుంబసభ్యుల ప్రచారం ముందు వెలవెలబోతోంది.!

# విశ్వసనీయతకు చోటివ్వండి
# ఫ్యాన్ గుర్తుకి ఓటెయ్యండి








మంచిని పెంచిన నాయకుడు.. ప్రజల మనసెరిగిన సేవకుడు

స్వర్గీయ డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి గారి

వారసుడు, మడమతిప్పని మగధీరుడు

## వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారిని

బలపరుద్దాం, ఫ్యాన్ గుర్తుకి ఓటేసి మంచితనానికి అండగా నిలుద్దాం!

## అఖిల భారత తెలుగు సమాఖ్య

చెన్నై.



ఆర్.శంకరన్
కోశాధికారి
మరియు పూర్వ అధ్యక్షులు
తమిళనాడు తెలుగు బ్రాహ్మణ మహాసభ



ప్రొ. సి.యం.కె.రెడ్డి
అధ్యక్షులు



ఆర్.నందగోపాల్‌నాయుడు
ప్రధాన కార్యదర్శి



జి.ఇస్రాయిల్
ఉపాధ్యక్షులు
మరియు వ్యవస్థాపకులు
తమిళనాడు ఆది ఆంధ్రా అరుందతీయ మహాసభ

## 'ప్రభా'తం

# అంతరిక్షంలో.. అద్భుత ప్రగతి



**పిఎస్ఎల్వి-సి45 రాకెట్ ద్వారా దేశ రక్షణ రంగానికి ఊతమిచ్చే 'ఇమిశాట్' ఉపగ్రహ ప్రయోగాన్ని, దాంతోపాటు మరో 28 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టి భారత్ తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. అంతేకాదు, బాలాసోర్ నుంచి 'మిషన్ శక్తి' అనే ఉపగ్రహ విధ్వంసక క్షిపణి ప్రయోగాన్ని కూడా దిగ్విజయంగా నిర్వహించి భారత్ తన సత్తాను చాటుకుంది. అంతరిక్షరంగంలో ఇలా అనేకానేక అద్భుతాలు సృష్టిస్తున్న మన శాస్త్రవేత్తల ప్రయోగాలు.. దేశానికే గర్వకారణం.**

ఒకప్పట్లో రాకెట్ ప్రయోగమంటే ఎంతో కష్టసాధ్యంగా ఉండేది. అది కక్ష్యలోకి ప్రవేశించిందనే సమాచారం వచ్చే దాకా ఎడతెగని ఉత్కంఠంగా ఉండేది. ఇప్పుడు భారత్ తన అద్భుతమైన పరిజ్ఞానంతో అవలీలగా రాకెట్లను ప్రయోగిస్తూ ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను కూడా మోసుకెళ్ళి అంతరిక్షంలో నిర్దేశించిన కక్ష్యలో ప్రవేశపెడుతూ..అంతరిక్ష రంగంలో ముందుకు దూసుకువెళ్తోంది. అందులోనూ ఇటీవలి కాలంలో గతంలో ఎన్నడూ లేనంత ఉత్సాహంతో రాకెట్లను, వాటితోపాటు ఎన్నెన్నో ఉపగ్రహాలను కూడా జతచేసి నింగిలోకి విజయవంతంగా పంపుతూ.. మన దేశం అద్భుతాలను సృష్టిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే భారత్..అంతరిక్షంలో అద్భుత ప్రగతిని సాధిస్తోంది. ఇది దేశానికే గర్వకారణం. నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) షార్ నుంచి ఇటీవల పిఎస్ఎల్వి సి-45 ద్వారా దేశరక్షణ రంగానికి ఊతమిచ్చే ఇమిశాట్ అనే సరికొత్త ఉపగ్రహ ప్రయోగాన్ని చేపట్టి విజయవంతం చేయడం షార్ కీర్తిని..మన శాస్త్రవేత్తల ప్రతిభను ప్రపంచానికి చాటింది. ఇప్పటిదాకా షార్ నుంచి 71 ప్రయోగాలు చేపడితే, అందులో పిఎస్ఎల్వి శ్రేణిలోవి 47 దాకా ఉండడం..ఇవన్నీ కూడా మన శాస్త్రవేత్తలకు విజయపరంపరలను చేకూర్చినవి కావడం ఎంతైనా విశేషమే మరి.

పిఎస్ఎల్వి (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) సి-45 రాకెట్ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఏప్రిల్ 1న జయ ప్రదంగా నిర్వహించి అంతరిక్షరంగ పరిజ్ఞానంలో అంతర్జాతీయస్థాయిలో మరింత ఖ్యాతిని సాధించింది. ఈ రాకెట్తో పాటు ఒకేసారి నింగిలోకి 29 ఉపగ్రహాలను కూడా విజయవంతంగా పంపి భారత్ తన సత్తా మరోసారి చాటుకుంది. అందులోనూ తొలిసారిగా 3 కక్ష్యల మిషన్తో భారత్ తన శక్తిసామర్థ్యాలను రుజువుచేసుకోవడం చరిత్రాత్మకంగా భావించవచ్చు. అంతరిక్షంలో వరుసగా 749, 504, 385 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలోకి విజయవంతంగా ఉపగ్రహాలను మన శాస్త్రవేత్తలు పంపారు. తొలుతగా ఈ రాకెట్ 749 కిలోమీటర్ల ఎత్తులో డిఆర్డిఓకి చెందిన 436 కిలోల ఇమిశాట్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత అక్కడినుంచి 504 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని విదేశాలకు చెందిన 28 ఉపగ్రహాలను కక్ష్యలోకి వదిలి పెట్టింది. ఆ తర్వాత అక్కడి నుంచి మూడుగంటల సేపు పయనించి మరో 485 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని అంతరిక్ష పరిశోధనకు అవసరమైన పేలోడ్స్ను కక్ష్యలో విడిచిపెట్టింది. ఇలా మూడు దశల్లోనూ ఎంతో క్లిష్టమైన ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేసి గగనతలంలో భారత్ తన ఘనకీర్తిని మరోసారి రెపరెపలాడించింది. అందులోనూ 'మిషన్ శక్తి' ద్వారా అంతరిక్ష భద్రతపై పూర్తిస్థాయిలో పట్టుసాధించిన భారత్, నిఘా విషయంలోనూ ముందుంటూ విదేశీ రాడార్ల శక్తిసామర్థ్యాలను పసిగట్టి ఫోటోలతో సహా సమాచారాన్ని సేకరించే ఇమిశాట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపడం ఈసారి ప్రయోగంలో ఒక మైలురాయి అని చెప్పవచ్చు. ఇమిశాట్తో పాటు, నాలుగు దేశాలకు చెందిన 28 నానో ఉపగ్రహాలను (వీటి బరువు 220 కిలోలు) కూడా ఈ రాకెట్ నిర్ణీత కక్ష్యలోకి చేర్చింది. ఎంతో సంక్లిష్టమైన ఈ ప్రయోగాన్ని దిగ్విజయం చేయడంతో మన శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంస అందుకుంటున్నారు. అందులోనూ ఇమిశాట్ ఉపగ్రహాన్ని డిఆర్డిఓ సంస్థ రూపొందించింది. దీనికి ఆ సంస్థ అధిపతి సతీశ్రెడ్డి నేతృత్వం వహించారు. ఈ ఉపగ్రహం శత్రుదేశాల రాడార్ల జాడను గుర్తించడంలో ఎంతో దిట్ట కూడా. ఈ ఉపగ్రహం తక్కువ ఎత్తులోనే తిరుగుతూ పొరుగుదేశాల రాడార్ల సమాచారాన్ని కనుగొనడంలో ముందుంటుంది. అంతేకాక, సరిహద్దుల నుంచి ఉగ్రవాదుల చొరబాట్లను పసిగట్టడంలో కూడా దీని సహకారం ఎంతో ఉంటుంది. పేలోడ్ పరిశోధనల ద్వారా సముద్రాల్లో ప్రయాణించే నౌకల నుంచి వచ్చే సమాచారాన్ని సేకరించేందుకు తగు పరిశోధనలు చేయనుంది.

ఇకపోతే, అంతరిక్షంలో 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉపగ్రహాన్ని క్షిపణితో కూల్చగల సామర్థ్యాన్ని కూడా భారత్ సొంతం చేసుకోగలగడం ఎంతైనా అద్భుతం!.. చరిత్రాత్మకం!.. ఇటీవల బాలాసోర్లోని డాక్టర్ ఏపిజె అబ్దుల్కలాం సెంటర్ నుంచి నిర్వహించిన ఉపగ్రహ విధ్వంసక క్షిపణి ప్రయోగం అటు అంతరిక్ష రంగంలోనూ, ఇటు సైనిక పాటవంలోనూ కీలక మలుపుగా భావించవచ్చు. ప్రపంచంలో ఇంతవరకు అమెరికా, రష్యా, చైనాల వద్ద మాత్రమే ఉన్న ఈ సాంకేతికతను భారత్ సొంతం చేసుకోవడం అంతరిక్షరంగ పరిజ్ఞానంలో ఒక ముందడుగేనని చెప్పవచ్చు. ఇలాంటి ప్రయోగాల వల్ల మనదేశం ఇప్పటికే ప్రయోగించివున్న అనేక ఉపగ్రహాలను రక్షించుకునేందుకు కూడా ఉపయోగంగానే ఉంటుందని అనుకోవచ్చు. అందులోనూ ఈ సాంకేతికత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించ గలిగామని రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్డిఓ) ఛైర్మన్ సతీశ్రెడ్డి వెల్లడించడం మన శాస్త్రవేత్తల అద్వితీయ ప్రతిభకు నిదర్శనం. మనదేశంపై కన్నేసే గూఢచారి ఉపగ్రహాలను ధ్వంసం చేసే క్షిపణిని తయారుచేయాలని రెండున్నర సంవత్సరాల క్రితం ప్రధాని మోడీ ఆదేశించారని, ఆ మేరకు డిఆర్డిఓ శాస్త్రవేత్తలు రేయింబవళ్ళు శ్రమించి 'మిషన్ శక్తి' క్షిపణిని రూపొందించారని సతీశ్రెడ్డి స్పష్టం చేశారు.

ఏదేమైనా అంతరిక్షరంగంలో భారత్ తన అద్వితీయమైన..అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ నిరంతర కృషి..పట్టుదలతో విరామమెరుగక శ్రమిస్తూ అనేకానేక ఘనమైన గగన విజయాలను సొంతం చేసుకుంటుండడం మన దేశానికి..ప్రతి ఒక్క భారతీయునికి ఎంతైనా గర్వకారణం.

## కమనీయం.. శ్రీ వేంకటేశ్వర కల్యాణం

శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నెల్లూరు బాలాజీనగర్లోని సీతారామస్వామి మందిరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఆదివారం ఎంతో భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తుల గోవిందనామ స్మరణల మధ్య కల్యాణోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఈ ఉత్సవానికి తన్నీరు మస్తాన్రావు-జ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, మందిరం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అమర్లూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, సభ్యులు పుండరీకాక్షయ్య, పూర్ణచంద్రరావు, పాదర్తి ఆంజనేయులు తదితరుల పర్యవేక్షణలో కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది.

## ఈదూరులో 6నుండి..
## వసంత నవరాత్రోత్సవాలు

నెల్లూరు జిల్లా టిపి గూడూరు మండలం ఈదూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానంలో ఈనెల 6 నుండి 29 వ తేదీ వరకు వసంత నవ రాత్రోత్సవాలు, శ్రీ అభయాంజనేయ స్వామి వారికి పూజలు, వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ రావి మోహన్ చౌదరి, వంశపారంపర్య ధర్మకర్త రావి రామ చంద్రయ్య నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## ముత్యాలమ్మా.. కరుణించమ్మా..

కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ముత్యాలమ్మ జాతర ఈనెల 2న వైభవంగా ప్రారంభమైంది. చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో నాలుగు రోజుల పాటు జరిగిన అమ్మవారి జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని 'దయగల తల్లి ముత్యాలమ్మ దీవించమ్మా' అంటూ వేడుకుంటూ జయజయధ్వానాలు చేశారు. తొలిరోజు అమ్మవారు నెమలిచీర అలంకారంలో కొలువు తీరి భక్తులకు దర్శనమిచ్చారు. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పేర్నాటి ఆనందరెడ్డి, కార్యనిర్వాహణాధికారి కోవూరు జనార్ధనరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఇది ఆత్మగౌరవాన్ని కించపరచడం కాదా?

ఏపి ప్రత్యేకహోదాకు కేసీఆర్ మద్దతు పలికితే... జగన్ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కించపరిచాడంటూ చంద్రబాబు ప్రచారం చేస్తున్నారు. జగన్కు కేసీఆర్ మద్దతుగా మాట్లాడిన దానిని అడ్డం పెట్టుకుని ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టాలని చూశారు. దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది వాళ్ళ పెత్తనం ఏంటంటూ రెచ్చగొట్టాడు. మరి ఫరూక్ అబ్దుల్లా ఎవరు? అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీలెవరు? చంద్రబాబు వీళ్ళ చేత ప్రచారం చేయించుకుంటే ఆంధ్రుల ఆత్మగౌరవం రెట్టింపవుతుందా?

*బసిరెడ్డి శ్రావణ్రెడ్డి, పోరుమామిళ్ళ.*

## రాజన్న బిడ్డను దీవిద్దాం

జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా నాయకుడు వై.యస్.జగన్మోహన్రెడ్డి సారథ్యంలోని వైసిపికి ఓటు వేసి రాజన్న బిడ్డను దీవిద్దాం. రాష్ట్ర ప్రజల అభిమాన నాయకుడు వై.యస్.రాజశేఖరరెడ్డి గతంలో అందించిన సంక్షేమ రాజ్యాన్ని జగన్మోహన్రెడ్డికి ఓటు వేయడం ద్వారా మళ్ళీ తీసుకొనివద్దాం. నవరత్నాలు అనే పథకాలు ప్రవేశపెడతానని జగన్మోహన్రెడ్డి హామీ ఇస్తున్నారు. ఆ హామీలు నెరవేర్చే అవకాశం జగన్కు కల్పించాలి. గత 5 సంవత్సరాల తెలుగుదేశం పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో నష్టపోయారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఎన్నో చేస్తామని అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాల ప్రజలను విస్మరించింది. అందుకే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సంక్షేమ పథకాల లబ్ది అందుకోవాలంటే జగన్ను సి.ఎంగా ఎన్నుకుందాం. నవ రత్నాలతో మన జీవితాలను మార్చుకుందాం. అభివృద్ధిలో ముందుకు పయనిద్దాం! జిల్లాలోని పది శాసనసభ నియోజకవర్గాల్లో, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపిద్దాం.

*డా॥ యస్.బాబురావు, కావలి.*

## కాంగ్రెస్ ముక్త్ భారత్

భారతదేశానికి పట్టిన శని కాంగ్రెస్పార్టీ. ఈ పార్టీ వల్లే దేశం అభివృద్ధి చెందలేక పోయింది. ఈ పార్టీ ఓట్ల బ్యాంకు విధానాల వల్లే దేశంలో ఎన్నో అరిష్టాలు చోటుచేసుకున్నాయి. ఈ పార్టీ నేతల స్వార్థపూరిత వైఖరి వల్లే జమ్మూకాశ్మీర్, ఖలిస్థాన్, బోడోలాండ్, నాగాలాండ్ వంటి సమస్యలు పుట్టుకొచ్చాయి. దేశం నుండి కాంగ్రెస్ను పూర్తిగా తరిమికొడితే ఈ దేశ రూపురేఖలు మారుతాయి.

*సి.రాజీవి, నెల్లూరు.*

## విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించింది నారాయణే!

ఆంధ్రప్రదేశ్లో విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిపోవడానికి ప్రధాన కారకుడు మంత్రి నారాయణే! నారాయణ విద్యాసంస్థలను విస్తరించి ప్రభుత్వ విద్యను నాశనం చేశారు. గ్రామాలలో కూడా నారాయణ కాన్సెప్ట్ స్కూల్స్ వెలిసాయి. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. ఫీజులు లక్షల్లోకి చేరాయి. ఇలాంటి కార్పొరేట్ శక్తులు గెలిస్తే అధికారం వారి చేతుల్లోకి పోతే ఇక సామాన్యుడు చదువుకోలేని పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.

*– ముప్పు శ్రీకృష్ణ, నెల్లూరు.*



# నెల్లూరురూరల్ రూలర్?





2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన చట్టంలో నుండి పుట్టుకొచ్చింది నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం. నెల్లూరు నగరంలో కొంత భాగాన్ని చీల్చి, అలాగే నెల్లూరురూరల్ మండలంలోని గ్రామాలను కలిపి ఏర్పాటు చేసిన నియోజకవర్గం. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి అతి కష్టం మీద 3131 ఓట్ల తేడాతో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిపై నెగ్గాడు. 2014 ఎన్నికల్లో పొత్తులో భాగంగా తెలుగుదేశం వాళ్ళు ఆ సీటును బీజేపీకి అప్పగిస్తే వైసిపి అభ్యర్థి విజయం అప్పుడు ఏకపక్షంగా నడిచింది. 2009లోగాని, 2014లో గాని తెలుగుదేశం పార్టీ ఇక్కడ తన అభ్యర్థులను నిలపకపోవడం వల్ల ఆ పార్టీ కేడర్ నిర్వీర్యమైపోయింది. ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ బలం ఎంతన్నది ఇంతవరకు తేలనేలేదు. ఆ పార్టీ కేడర్‌ను ఇంతవరకు సమన్వయపరిచే దిశగా ఒక్క ఎలక్షన్ కూడా జరగలేదు.

2019 ఎన్నికల్లో మాత్రం నాటకీయ పరిణామాల మధ్య తెలుగుదేశం అభ్యర్థిగా మేయర్ అబ్దుల్ అజీజ్ పోటీ చేస్తున్నాడు. మొదట నెల్లూరురూరల్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ప్రకటించడం తెలిసిందే! ఆదాల అభ్యర్థి అన్నాక నియోజకవర్గంలోని టిడిపి కేడర్‌లో ఒక ఊపు, ఉత్సాహం కనిపించింది. ఆయనే అభ్యర్థిగా వుండుంటే పరిస్థితులు ఇంకో రకంగా ఉండేవేమో?! తెలుగుదేశంలో చోటుచేసుకున్న వర్గ రాజకీయాల మూలంగా ఆయన వైసిపిలో చేరి పార్లమెంట్ అభ్యర్థి కావడం, చివరి నిముషంలో మేయర్ అబ్దుల్ అజీజ్ తెరమీదకు రావడం చకచకా జరిగిపోయాయి. ఆదాల వుండుంటే నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి వేరు. అజీజ్ అభ్యర్థి అయ్యేసరికి ఒక్కసారిగా లెక్కలు మారాయి. ఇక్కడ మైనార్టీ ఓట్ల సంఖ్య 30వేలకు పైమాటే అయినప్పటికీ, ఏ పార్టీ ఎంత స్థాయిలో వీరిని ఆకర్షించి ప్రసన్నం చేసుకుంటుందోనన్నది కీలకాంశం. ఒకసారి కాంగ్రెస్, ఇంకోసారి వైకాపా ఈ నియోజకవర్గంలో గెలిచాయి. గెలుపు కోసం ఓవైపు తెలుగుదేశం, ఇంకో పక్క జనసేన అభ్యర్థి మనుక్రాంత్ చెన్నారెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వారి పోరాటం ఎంత వరకు ఫలిస్తుందన్నది వేచి చూడాలి...!

# గూడూరు... ఎవరిదో జోరు





నేదురుమల్లి, నల్లపరెడ్డి వంటి రాజకీయ కుటుంబాలకు పుట్టినిల్లు గూడూరు నియోజకవర్గం. కోట, వాకాడుల యుద్ధం ఆరంభమైంది ఇక్కడే! అయితే గూడూరు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం కావడం వల్ల ఈ రెండు కుటుంబాలు కూడా తమ రాజకీయ పోరాటాలకు వెంకటగిరి, కోవూరు నియోజకవర్గాలకు వలస వెళ్లాయి.

ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటలాంటి నియోజకవర్గం. ఆ పార్టీని పెట్టాక 1983, 1985, 1994, 1999, 2009 ఎన్నికల్లో విజయం సాధించింది. 1989, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, 2014 ఎన్నికల్లో వైసిపి గెలిచాయి.

ఇప్పుడు రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. 2014లో ఏ వైసిపి నుండి అయితే పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచాడో, ఆ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇప్పుడు తెలుగుదేశం అభ్యర్థి. గెలిచిన రెండో యేడాదే ఆయన టిడిపిలోకి వెళ్లాడు. ఇక ఐదేళ్ళు తిరుపతి పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన వెలగపూడి వరప్రసాద్ ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి. అభ్యర్థుల పరంగా చూస్తే పాశం సునీల్‌పై పార్టీ మార్చిన వ్యతిరేకత వుంది. వరప్రసాద్ గతంలో ఈ నియోజకవర్గానికి కూడా ఎంపీనే! ఎంపీగా ఆయన పెర్ఫార్మెన్స్ బాగానే వుంది. వ్యతిరేకత లేదు. నియోజకవర్గంపై అవగాహన ఉన్నోడు.

ఇక పార్టీల పరంగా చూస్తే వైసిపి ఒక్క ఏడాదిలోనే వూహించని వేగమందుకుంది. నియోజకవర్గంలో ఆయా గ్రామాలలో ఓటర్లను ప్రభావితం చేయగల నాయకులందరూ వైసిపిలో చేరివున్నారు. నల్లపరెడ్లు, నేదురుమల్లి, పేర్నాటి, వేమారెడ్డి, పొణకా, ఎల్లసిరి, కోడూరు... ఇలా పెద్ద రాజకీయ కుటుంబాలన్నీ వైసిపిలో చేరడం ఆ పార్టీ బలాన్ని పెంచింది. ఇక నియోజకవర్గంలో అంతో ఇంతో బలమున్న మాజీఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ తెలుగుదేశాన్ని వదిలేసి వైసిపి నుండి తిరుపతి లోక్‌సభ అభ్యర్థి కావడం కూడా స్థానిక వైసిపి అభ్యర్థికి కలిసిరావచ్చు. 2014 ఎన్నికల్లో గూడూరు టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ బి.జ్యోత్స్నలతను ఈ ఎన్నికల్లో పక్కన పెట్టారు. దీంతో ఆమె వైసిపిలో చేరింది. గూడూరు పట్టణంలో టిడిపికి మద్దతుదారులుగా వుండే ఆర్యవైశ్యులు ఈసారి వైసిపికి మద్దతు నిస్తున్నట్లు తెలుస్తోంది.

నియోజకవర్గంలో తెలుగుదేశం కేడర్ కకావికలం కావడం, సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్ పట్ల వున్న వ్యతిరేకత స్థానిక వైసిపి అభ్యర్థికి వరంగా మారుతున్నాయి.

## క్రాస్ ఓటింగ్‌కు...
# ఛాన్సుందా?

***రాష్ట్రంలో లోక్‌సభకు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంటుంది. పార్టీలను బట్టి కాకుండా అభ్యర్థులను బట్టి ఈ క్రాస్ ఓటింగ్ జరుగుతుంటుంది. ఈ క్రాస్ ఓటింగ్ విషయంలో ఓటరు చాలా చైతన్యవంతంగా వ్యవహరిస్తుంటారు.***

2014 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ పరిధిలో భారీ ఎత్తున క్రాస్ ఓటింగ్ చోటు చేసుకోవడం గమనార్హం. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు స్థానాలలో అప్పట్లో 5 స్థానాలలో వైసిపి అభ్యర్థులు గెలిచారు. రెండు స్థానాలు మాత్రమే టిడిపికి దక్కాయి. అసెంబ్లీల వారీగా చూస్తే ఏడు సెగ్మెంట్ల మీద వైసిపికి దాదాపు 70వేల మెజార్టీ వుంది. కాని లోక్‌సభకు వచ్చే సరికి కేవలం 13వేల మెజార్టీతో ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుగా గెలిచాడు. అంటే దాదాపు 60వేల ఓట్లు క్రాస్ జరిగాయి. నెల్లూరు రూరల్, నగరం, కోవూరు, కావలి, కందుకూరు నియోజకవర్గాలలో క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగింది. ఆరోజు ఎంపి అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై వున్న వ్యతిరేకత, తెలుగుదేశం ఎంపీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డికున్న పరిచయాలు, నరేంద్ర మోడీ ఇమేజ్ భారీ క్రాస్‌ఓటింగ్‌కు కారణాలుగా చెప్పుకోవచ్చు. కాని, 2014 ఎన్నికలు పార్టీలమధ్య కంటే కూడా అభ్యర్థుల మధ్య పోటీతో ఎక్కువగా నడిచాయి.

మరి 2019 ఎన్నికలలో ఆ పరిస్థితి వుందా? ఇప్పుడు అభ్యర్థుల కంటే కూడా పార్టీల మధ్యే ఎక్కువగా పోటీ నడుస్తోంది. అభ్యర్థుల ప్రభావం పెద్దగా వుండకపోవచ్చు. లోక్‌సభ, అసెంబ్లీలలో ఓటింగ్ సరళి ఒకే తరహాలో వుండొచ్చు. అటు తెలుగుదేశంలోనూ, ఇటు వైసిపిలోనూ సామాజిక కోణంలో ఒకట్రెండు వర్గాల ఓటర్లు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడవచ్చేమోగాని, 2014 స్థాయిలో ఈసారి భారీగా క్రాస్ ఓటింగ్ వుండకపోవచ్చు.!




## కావలి...
# కనకపట్నం... ఎవరికి కట్నం





కావలి... వస్త్ర వ్యాపారంలో ఆంధ్రాముంబై. ఎంతోమంది విప్లవ వీరులకు జన్మనిచ్చిన జవహర్ భారతి విద్యాసంస్థల నెలవు. రాజకీయాలలో టక్కున గుర్తొచ్చే కలికి యానాదిరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడు వంటి నాయకులు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం.

2019 ఎన్నికల పోరు కావలి వేదికపై రసవత్తరంగా వుంది. వైసిపి నుండి సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డే మళ్ళీ దిగాడు. విచిత్రమేంటంటే ఈసారి ఆయనకు వైసిపి టిక్కెట్ ఇవ్వొద్దంటూ పార్టీలో గట్టిగా అడ్డం పడ్డ మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డే అతనికి ప్రత్యర్థిగా మారాడు. వైసిపిలో వున్న విష్ణు తెలుగుదేశంలో చేరడం, కావలి టిడిపి అభ్యర్థి కావడం తెలిసిందే!

కావలి నియోజకవర్గం అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోట ఒకప్పుడు. 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించాక ఆ పార్టీ ఇంతవరకు గెలిచింది 1983, 1999, 2009 ఎన్నికల్లో మూడుసార్లు మాత్రమే! అంతలావు 1994 ప్రభంజనంలో కూడా జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన ఒకే ఒక్క సీటు కావలి. కాబట్టి తెలుగుదేశంకు ఈ నియోజకవర్గంపై కొంత పట్టు తక్కువేననుకోవాలి. అయితే 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన మూలంగా జలదంకి, కలిగిరి మండలాలు ఉదయగిరిలో కలవడంతో, అలాగే అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాలు కొత్తగా కావలిలో కలవడం ద్వారా తెలుగుదేశం కొంత బలం పుంజుకుంది. 2009, 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన బీద మస్తాన్‌రావు ఈ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నుండి దిగుతున్నాడు. కావలి అసెంబ్లీ నుండి ఆయనే ఈసారి కూడా దిగుంటే పరిస్థితి ఇంకా మెరుగ్గా ఉండేదేమో!? వైసిపి నుండి వచ్చిన విష్ణు అభ్యర్థి కావడంతో తెలుగుదేశంలో కొంత గందరగోళంగా వుంది. అల్లూరు మండలంలో విష్ణుకు బీద వర్గీయులు ఎంతవరకు సహకరిస్తారన్నది సందేహం. విష్ణు ఒకసారి గెలిస్తే కావలిపై బీద సోదరుల ఆధిపత్యం పోయినట్లే! మళ్ళీ వాళ్ళకు నియోజకవర్గం దొరకడం చాలా కష్టం.

ఇక వైసిపి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి రెండో గెలుపు కోసం ప్రయత్నిస్తున్నాడు. అల్లూరు మండలంలో బీద, విష్ణు వర్గాలు ఏకమైతే ప్రతాప్‌కు కొంత నష్టమే! ఆదాల ఎంపీ అభ్యర్థి కావడం ప్రతాప్‌కు కలిసొచ్చే అంశం. కావలి పట్టణంలో వైసిపి ప్రభావంపై ఎక్కువ ఆశలున్నాయి. ఎమ్మెల్యేగా అతనిపై ప్రజల్లో వ్యతిరేకత లేదు. జగన్ గాలి పనిచేస్తే తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడం పెద్ద కష్టమేమీ కాదనే నమ్మకంతో వున్నాడు.

# పోలింగ్ కేంద్రాల్లో వీడియో చిత్రీకరణ ఉండాలి

## - రాష్ట్ర ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది

పోలింగ్ నిర్వహణ మొత్తాన్ని వీడియో చిత్రీకరణ చేయాలని, అందుకోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రాఫర్లను ఏర్పాటుచేసి, అన్ని దృశ్యాలను చిత్రీకరించాలని భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈనెల 1న సచివాలయం నుండి కేంద్ర పరిశీలకులు కె.కె శర్మతో కలసి రాష్ట్రంలోని జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలవారీగా భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది నియామకం వగైరా అంశాలపై సమీక్షించారు. జిల్లా నుండి జిల్లా ఎన్నికల అధికారి రేవు ముత్యాలరాజుతో ఆయన సమీక్షించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పటిష్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి నెల్లూరు పార్లమెంట్ వ్యయపరిశీలకులు మానిష్‌కుమార్ చావ్లా, సర్వేపల్లి-ఉదయగిరి వ్యయపరిశీలకులు రాజేంద్రకుమార్ పోలీసు పరిశీలకులు ప్రవీణ్ సాలంకి, జిల్లా పోలీసు అధికారి ఐశ్వర్య రస్తోగి, తిరుపతి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కె. వెట్రిసెల్వి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



# అధినేతల ప్రచారం ముగిసినట్లే!





ఈ నెల 2, 3తేదీలలో తెలుగు దేశం అధినేత చంద్రబాబునాయుడు జిల్లాలోని ముత్తుకూరు, నెల్లూరు, ఆత్మకూరు, ఉదయగిరిలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక చంద్రబాబు ఎన్నికల ప్రచారం ఈ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వుండకపోవచ్చు. గత నెల 25వ తేదీన ఆయన ఒకేరోజు గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరిలలో ప్రచారం నిర్వహించడం తెలిసిందే!

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి 4వ తేదీ నెల్లూరు నగరంలో భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇటీవల ఆయన గూడూరు, కావలిలలో ప్రచార సభలు నిర్వహించడం తెలిసిందే! అంతకుముందు ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా మిగిలిన అన్ని నియోజకవర్గాలలోనూ తిరిగి వున్నారు. నెల్లూరు నగరం ఒక్కటే మిగిలిపోయి వుండింది. 4వ తేదీ నెల్లూరు నగర అసెంబ్లీ ప్రచారాన్ని కూడా భర్తీ చేశారు. ఎన్నికలు 11వ తేదీనే! 9వ తేదీ సాయంత్రానికి ప్రచారం పూర్తి చేయాలి. కాబట్టి ఇక జిల్లాలో ఇద్దరు అధినాయకుల ప్రచారం వుండకపోవచ్చు.

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా ఈ మధ్య జిల్లాలో పర్యటించగా, ఆయన సభలకు జనం లేక వెలవెలబోవడం తెలిసిందే!

## నెల్లూరు కబుర్లు

### ఫిట్స్‌కు సింహపురిలో
## విజయవంతంగా శస్త్రచికిత్స

రోజుకు నాలుగైదు సార్లు ఫిట్స్‌తో బాధపడుతున్న చిన్నారికి విజయవంతంగా శస్త్ర చికిత్స చేసారు సింహపురి వైద్యులు. ఈనెల 2న సింహపురి హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ నరాల శస్త్ర చికిత్స వైద్య నిపుణుడు వెంకటేశ్వర ప్రసన్న మాట్లాడుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్న పేరూరుకు చెందిన సుబ్బయ్య, రాజేశ్వరి దంపతుల కుమార్తె గాయత్రి అయిదేళ్ళుగా ఫిట్స్‌తో బాధపడుతోందని, ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేక పోవడంతో సింహపురి ఆసుపత్రికి వచ్చారన్నారు. గాయత్రికి అవసరమైన చికిత్సలు జరిపి మేజియల్ టెంపోరల్ స్క్లిరోసిస్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. చిన్నారికి సెలెక్టివ్ టెంపోరల్ లోబెక్టమీ శస్త్ర చికిత్స చేసి సాధారణ స్థితికి తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం ఫిట్స్ పూర్తిగా తగ్గిపోయాయని సహకరించిన అనస్థీషియా డాక్టర్ రాజమోహన్ రెడ్డి, ఇతర వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యూరాలజిస్ట్ దీక్షాంత్ నారాయణ్, చిన్నారి గాయత్రి ఆమె తండ్రి సుబ్బయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్య సిబ్బందిని ఆసుపత్రి ఎం.డి కె.రవీంద్రరెడ్డి అభినందించారు.

## ఆకట్టుకున్న కవి సమ్మేళనం




కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న గుర్రాల రమణయ్య

నెల్లూరు ఆదిత్య కళాశాల సెమినార్ హాల్‌లో గతనెల 30న జీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు గుర్రాల రమణయ్య సభాధ్యక్షులుగా వ్యవహరించగా ముఖ్యఅతిథులుగా ప్రముఖ కవి శ్రీరామకవచం, ఆచార్య ఆదిత్య, డాక్టర్ పాతూరి అన్నపూర్ణ పాల్గొన్నారు. అనంతరం 30 మంది కవులు కవి సమ్మేళనంలో పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు. కవులు సొంపల్లి ఆనందరావు, చదలవాడ రమణయ్య, బొగ్గరపు ఇందిర, తోట సులోచన, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండెక్కిన కోడి

ఎన్నికల పుణ్యాన మార్కెట్‌లో చికెన్ ధరలు మళ్ళీ కొండెక్కి కూర్చున్నాయి. మొన్నటిదాకా కిలో స్కిన్‌లెస్ చికెన్ 180 రూపాయలే వుండింది. ఇప్పుడు ఎన్నికల సీజన్ కావడంతో చికెన్ వినియోగం పెరిగింది. పార్టీ మీటింగ్‌లకు, పార్టీ కార్యాలయాలలో కార్యకర్తలకు చికెన్ బిర్యాని పొట్లాలనే ఎక్కువగా పంచుతున్నారు. ప్రతిరోజూ ప్రతి గ్రామంలో ఆయా పార్టీల అభ్యర్థుల ఆధ్వర్యంలో మాంసాహార విందులు జరుగుతున్నాయి. దీంతో ఎండలతో పాటు చికెన్ రేట్లు కూడా మండుతూ కిలో 210 రూపాయలైంది.

## బెంబేలెత్తుతున్న సిబ్బంది

నెల్లూరు నగరంలో వరుసగా జరిగి రెండు సంఘటనలతో డబ్బులు ఎత్తుకుని పోవాలంటేనే నాయకులు భయపడుతున్నారు. నగరంలోని ఒకటో పోలీసుస్టేషన్ పరిధిలో తెలుగుదేశం నాయకులు కరెన్సీ కట్టలతో పట్టుబడ్డారు. పట్టుబడిన వాళ్ళు నెల్లూరు నగర తెలుగుదేశం అభ్యర్థికి చెందిన విద్యాసంస్థల సిబ్బందే! తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు కాకుండా డబ్బు వ్యవహారాలను విద్యాసంస్థల సిబ్బంది చూస్తున్నారు. అయితే నారాయణ సంస్థల సిబ్బంది మీద ప్రత్యర్థులు నిఘా పెట్టారు. ఎవరెవరు ఎక్కడెక్కడికి డబ్బులు మోస్తున్నారనేది తెలుసుకుని పోలీసులకు సమాచారమందిస్తున్నారు. పోలీసులకు వీళ్ళు పట్టుబడుతుండడం, టీవీలలో వాళ్ళ ముఖాలు కనిపిస్తుండడం, వాళ్ళు నివాసముంటున్న చోట నలుగురూ వీరి గురించి మాట్లాడుకుంటుండడంతో వీళ్ళకు తల కొట్టేసినంత పనవుతోంది. అందుకే డబ్బు కట్టలు మోయాలంటేనే ఇప్పుడు ఆ సంస్థల సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు.

### ఆంజనేయస్వామి
## వెండి డాలర్లు పంపిణీ

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలో కొలువైయున్న శ్రీ సీతారామ లక్ష్మణ సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈనెల 2న భక్తులకు 2800 స్వామి వారి రూపంతో వున్న వెండి డాలర్లను ఉచితంగా అందజేశారు. ఆలయంలో స్వామివారిని 8181 వెండి డాలర్లతో అలంకరించి 108 రోజులపాటు ఆలయ అర్చకుడు ముదివర్తి శ్రీనివాసాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. 3వతేది రాత్రి స్వామివారికి 216 బుట్టల్లో 11 రకాల సుగంధభరిత పుష్పాలతో పుష్పయాగం నేత్రపర్వంగా జరిగింది. దేవస్థాన పునర్నిర్మాణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పెనుకొండ వెంకట సుబ్బారావు, అయితా రామచంద్రరావు, సభ్యులు పాదర్తి బాలాజీ, పాదర్తి సాయిబాబా, బెల్లంకొండ శ్రీనివాసులు, పైడా హేమంతకుమార్‌లు పర్యవేక్షించారు.

# ఆకర్షిస్తున్న అధికారుల ప్లెక్సీలు

ఓటింగ్‌పై అవగాహన పెంచేందుకు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఫోటోలతో నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఓటు వజ్రాయుధం... ఓటు విలువ తెలుసుకోండి... మంచినేతను ఎన్నుకోండి... మద్యానికి, నోటుకు ఓటు అమ్ముకోవద్దు అనే నినాదాలతో నగరంలోని ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ప్రజలు ఎంతో ఆసక్తిగా చదువుతున్నారు. అలాగే ఈ నెల 2వ తేదీ నెల్లూరు కలెక్టరేట్ క్యాంప్ ఆఫీసులో ఓటరు అవగాహనా బెలూన్లను ఆవిష్కరించారు. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం ద్వారా ఎలా ఓటు వేయాలి, వేసిన ఓటు ఖచ్చితంగా పడిందా? లేదా? వివిప్యాట్‌లో ఎలా చూసుకోవాలనే అంశాలపై కూడా అవగాహన కల్పించేందుకు నమూనా ఇవిఎంలను ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా కూడా ఓటర్లకు అవగాహన కలిగించేలా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.




నమూనా ఇవిఎంను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జేసి వెట్రిసెల్వి

### జయభారత్ ఆసుపత్రికి...
# దొడ్ల ట్రస్టు వారు 10 లక్షలు ఇచ్చారు



ఆసుపత్రి నిర్వాహకులకు విరాళం చెక్కును అందచేస్తున్న పొన్నలూరు సీతారామిరెడ్డి

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి వారి సేవలను గుర్తించి చెన్నైలోని దొడ్ల రుక్మిణమ్మ-వరదారెడ్డి ట్రస్ట్, మేనేజింగ్ ట్రస్టీ దొడ్ల రఘునాథరెడ్డి (యుఎస్ఏ)లు గతనెల 28న ఆ ఆసుపత్రికి 10 లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. ట్రస్ట్ ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి ఆ మేరకు జయభారత్ ఆసుపత్రి నిర్వాహకులకు ఆ మొత్తాన్ని చెక్కు రూపేణా అందజేశారు. గతంలో కూడా ఈ ఆసుపత్రి అభివృద్ధి కోసం తమ ట్రస్ట్ తరపున కోటీ 15 లక్షల రూపాయలను విరాళంగా అందించినట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. జయభారత్ ఆసుపత్రివారు చేస్తున్న సేవాకార్యక్రమాల్లో తమ ట్రస్ట్ భాగస్వామి కావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న జయభారత్ ఆసుపత్రి సేవలు అభినందనీయమని, ఆ ఆసుపత్రికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జయభారత్ ఆసుపత్రి ట్రస్టీ గుర్రం సుధాకర్, మేనేజర్ రమణయ్య, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు
## వేడుకగా స్తంభప్రతిష్ట

– 14 నుంచి 24 దాకా ఉత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రారంభసూచకంగా ఆదివారం సాయంత్రం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలమండలి ఛైర్మెన్ మన్నెం లక్ష్మీనాథరెడ్డి ఆధ్వర్యంలో స్తంభప్రతిష్ట నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసి బ్రహ్మోత్సవ పూజలకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 14 నుంచి 24వ తేదీ దాకా ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివార్లకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఛైర్మెన్ ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో గరుడాళ్వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనాచార్యులు మేల్కోటి భట్టాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు విశేషపూజలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. విగ్రహదాతలు కొప్పంచి మోహన్‌రావు -జయంతి దంపతులు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



### శ్రీ రంగనాథుని
## హుండీ ఆదాయం పెరిగింది

– గత ఏడాదికంటే 2 లక్షలు అధికం!

నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి హుండీ ఆదాయం గత ఏడాదికంటే సుమారు 2లక్షలకు పైగానే పెరిగింది. బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలతో పాటు, 52 రోజులకు భక్తులు వేసిన కానుకలు, టిక్కెట్ల అమ్మకం, ప్రసాదాల విక్రయం అన్నీ కలిపి మొత్తం 10,04,854 రూపాయలు వచ్చిందని గత ఏడాది బ్రహ్మోత్సవాల హుండీల లెక్కింపుతో పోలిస్తే ఇది 2,26,424 రూపాయలు అధికమని ఆలయవర్గాలు పేర్కొన్నాయి. అదేవిధంగా స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా 76 గ్రాముల బంగారం, 675 గ్రాముల వెండి వస్తువులున్నాయి. గతనెల 28న ఈ లెక్కింపు జరిగింది. ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఆలయ ఇ.ఓ వేమూరి గోపి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, సభ్యులు ఈ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# వాగ్దానాలు... వివాదాలు... నినాదాలు!

**ఎన్నికలొచ్చాక సమస్యలు పుట్టుకొస్తుంటాయి. కొత్త వివాదాలు, కొత్త కొత్త నినాదాలన్నీ తెరమీద కొస్తుంటాయి. బూజుపట్టిన సమస్యలన్నీ మళ్ళీ జుట్టు విదిల్చుకొని రోడ్డెక్కుతుంటాయి. ఈ సమస్యలెప్పటికీ పరిష్కారం కావు. ఇవి సమస్యలుగా సజీవంగానే వుంటేనే నాయకులకు ప్రతి ఎన్నికలలోనూ అస్త్రాలుగా ఉపయోగపడుతుంటాయి.**





ఈ ఎన్నికలలో నియోజకవర్గాల వారీగా అలాంటి అస్త్రాలను ఇరు ప్రధాన పార్టీల నాయకులు వాడుతున్నారు. గత రెండు ఎన్నికలుగా జిల్లాలో దుగరాజ పట్నం, రామాయపట్నం పోర్టులు ప్రధాన ఎన్నికల అస్త్రాలుగా వున్నాయి. గూడూరు అసెంబ్లీ నుండి, తిరుపతి పార్లమెంట్ నుండి పోటీ చేస్తున్న నాయకులేమో మా పార్టీ అధికారంలోకి వస్తే దుగరాజపట్నం పోర్టు సాధిస్తామని శపథాలు చేస్తున్నారు. కావలి నుండి పోటీ చేసే నాయకులేమో రామాయపట్నం పోర్టు అంశాన్ని ప్రచారం చేసుకుంటున్నారు. అలాగే కావలి అభ్యర్థులకు దగదర్తి ఎయిర్‌పోర్టు కూడా ఒక ఎన్నికల నినాదంగా వుంది. ఉదయగిరి అభ్యర్థులకు ఎప్పటిలాగే వెలుగొండ ప్రాజెక్ట్ సాధన, సీతారాంసాగర్ రిజర్వాయర్‌లు ప్రధాన ఎన్నికల అస్త్రాలు. అలాగే ఈ ప్రాంతానికి సోమశిల నీళ్ళు అన్నవి కొత్తగా చేరిన స్లోగన్. ఇక సంగం, నెల్లూరు బ్యారేజీలను పోలవరం ప్రాజెక్టులు కట్టినట్లుగా కడుతున్నారు. 2006లో దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి ఈ బ్యారేజీలకు శంకుస్థాపన చేశారు. 13ఏళ్ళుగా ఈ బ్యారేజీలను కడుతూనే వున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ఏడాదిలోనే ఈ బ్యారేజీలు పూర్తి చేస్తామని చెప్పింది. మంత్రి నారాయణ ఈ బ్యారేజీలపై ప్రత్యేక టాస్క్ చేశారు. ఇదిగో ఇంకో మూడు నెలల్లో ప్రారంభిస్తాం అంటూ పదమూడుసార్లు చెప్పారు. అవి పూర్తికాకుండానే మళ్ళీ ఎన్నికలు వచ్చాయి. ప్రతి ఎన్నికల్లోనూ నాయకులకు గుర్తొచ్చే ఇంకో అంశం బిట్రగుంట రైల్వే అభివృద్ధి. ఈ ఎన్నికల్లో కూడా అది మళ్ళీ గుర్తుకొచ్చింది. ఈసారి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ తిరిగి తెరిపిస్తామని ఎవరూ అనడం లేదు. ఎందుకంటే తిరిగి తెరిపించలేనంతగా అది పాడైపోయిందనే విషయం అందరికీ తెలుసు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, పులికాట్ సరస్సు అభివృద్ధి, థర్మల్ ప్రాజెక్ట్‌ల కాలుష్యం, సోమశిల హైలెవల్ కెనాల్, తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్ వంటి అస్త్రాలు ప్రతి ఎన్నికలలోనూ ప్రచార సాధనాలుగా ఉపయోగపడుతుంటాయి.

## "చెంగాళమ్మ తల్లి" సేవలో సతీష్‌రెడ్డి



ఓవైపు అధునాతన సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానం, మరోవైపు ఆధ్యాత్మిక తత్వం... ఈ రెండింటికీ సమపాళ్ళలో న్యాయం చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన వారు మన దేశంలో ఎందరో వున్నారు. ఈ కోవకు చెందిన మన నెల్లూరీయుడే జి.సతీష్‌రెడ్డి. డిఆర్‌డిఓ ఛైర్మన్‌గా దేశ రక్షణ విభాగంలో తన సేవలందిస్తూ.. ఎప్పుడూ తీరిక దొరికినా తన జన్మభూమి నెల్లూరుకి వచ్చి వెళ్ళే సతీష్‌రెడ్డి ఏప్రియల్ 1న జిల్లా కొచ్చాడు. ఇక్కడ జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు తనకు జన్మనిచ్చిన తల్లితో గడిపి తిరుగు ప్రయాణంలో సూళ్ళూరుపేట చెంగాళమ్మను కూడా దర్శించుకుని ఢిల్లీకి వెళ్ళిపోయాడు. సతీష్‌రెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలతో ఆశీర్వదించి పంపారు అధికారులు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత
శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు
కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 36 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...
వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి
రాష్ట్ర వ్యవసాయ, హార్టికల్చర్, సెరీకల్చర్, అగ్రిప్రాసెసింగ్ శాఖామాత్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - శ్రుతి | యల్లా శర్వీన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | - డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - స్నిగ్ధ | | |

## గూడూరు డివిజన్ వార్తలు

### వైసిపిలో చేరిన

# జిల్లా టిడిపి తొలి దళపతి... చలపతి



సీనియర్ న్యాయవాది చలపతిరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న వరప్రసాద్, మల్లు విజయకుమార్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ నెల్లూరుజిల్లా శాఖ తొలి అధ్యక్షుడు, బ్రాహ్మణసేవాసంఘం అధ్యక్షుడు, న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది యరగుడిపాటి చలపతిరావు బుధవారం వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్, వైకాపా నాయకులు మల్లు విజయకుమార్‌రెడ్డి, రాజారెడ్డి, పిడూరు నాగేశ్వరరావు, తిరుమలేశు తదితరులతో పాటు పలువురు న్యాయవాదులు చలపతిరావును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చలపతిరావు మాట్లాడుతూ, నందమూరి తారకరామారావు ఆశయాలకు సంతోషించి 1982లో తెలుగుదేశం పార్టీలో చేరానని, 1983లో జిల్లా టిడిపి కన్వీనర్‌గా పనిచేసి, తదుపరి నెల్లూరుజిల్లా టిడిపికి తొలి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికై పార్టీకి సేవలందించానన్నారు. ఆ తర్వాత చంద్రబాబునాయుడు హయాంలో ఎలాంటి గుర్తింపునకు నోచుకోలేదని, చంద్రబాబు మోసపుమాటలకు, అబద్దాలకు విసిగివేసారిపోయి వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరామని అన్నారు. వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తమ కోరిక అని, ఈ ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్‌ను, ఎంపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్‌ను గెలిపించేందుకు కృషిచేస్తామని అన్నారు. గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి వరప్రసాద్‌ను ఆయన అభినందించారు.

## మా పార్టీ అభ్యర్థులను గెలిపించండి



మా పార్టీ అభ్యర్థులను గెలిపించండంటూ చలపతిరావును కోరుతున్న హరిచంద్రారెడ్డి

గూడూరు రెండవ పట్టణంలోని 23వ వార్డు మాలవ్యానగర్‌లో సోమవారం వైకాపా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కనుమూరు హరిచంద్రారెడ్డి, ప్రముఖ సీనియర్ న్యాయవాది, గూడూరు బ్రాహ్మణసేవాసంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావును కలసి వైకాపా తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను గెలిపించాలని వారు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గూడూరు ఎంపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి వి. వరప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ ఎన్నికల్లో వైకాపాను భారీ మెజార్టీతో గెలిపించుకుని జగన్‌ను సిఎంగా చూడాలని వారు కోరారు.



తిరుపతి పార్లమెంట్ వైసిపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్‌రావును, గూడూరు అసెంబ్లీ వైసిపి అభ్యర్థి వి.వరప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఇటీవల గూడూరు పట్టణంలోని 14వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గూడూరు మునిసిపల్ ఛైర్మెన్ పొణకా దేవసేనమ్మ, నాయకులు పొణకా శివకుమార్‌రెడ్డి, దివ్యతేజారెడ్డి, కౌన్సిలర్ కల్పన, శ్రీహరి, షంషీర్ తదితరులు.

### అధికారంలోకి వస్తే..

# నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తా

### - గూడూరు రోడ్‌షోలో వైకాపా అధినేత జగన్

తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని వైఎస్సార్‌సీపి అధినేత డా.వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గూడూరులోని బనిగిసాహెబ్‌పేట సెంటర్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన రోడ్‌షోలో జగన్ మాట్లాడుతూ వైకాపా నాయకులు ఇచ్చే హామీలను ముఖ్యమంత్రి కాపీ కొడుతూ ప్రజలను మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నాడని ఆయన విమర్శించారు. గూడూరులో పాదయాత్ర చేస్తున్నప్పుడు నిమ్మరైతుల ఆవేదన, రుణ మాఫీ అందక రైతులు పడుతున్న అగచాట్లు, గిట్టుబాటు ధరలు లేక పడుతున్న అవస్తలు, జిల్లాలోని ఆత్మకూరులో ఓ విద్యార్థి తండ్రి ఫీజులు చెల్లించలేక పడుతున్న ఆవేదన అన్నీ తనకు జీవితాంతం గుర్తుంటాయన్నారు. తమ ప్రభుత్వం రాగానే నవరత్నాల పథకాల ద్వారా ప్రతి పేద కుటుంబానికి లబ్ది చేకూరుతుందన్నారు. రైతులకు భరోసా కింద ప్రతి ఏటా 12,500 రూపాయలు అందజేస్తామన్నారు. గ్రామాల్లో వాలెంటీర్లను ఏర్పాటు చేసి ప్రతి 50 ఇళ్ళకు ఒకరిని నియమించి వారి ద్వారా ప్రతి పథకం అందేలా చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్సీపి ఎమ్మెల్యే అభ్యర్థి వి.వరప్రసాద్, ఎంపి అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్‌రావులను అఖండమెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు వైయస్సార్‌సీపి అభ్యర్థులు మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, జగనన్న ద్వారా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన, వైయస్సార్‌సీపి నాయకులు పాల్గొన్నారు.



### హెలిప్యాడ్ వద్ద జగన్‌కు ఘనస్వాగతం



వైయస్సార్‌సీపి అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం గూడూరుకు హెలికాప్టర్‌లో వచ్చారు. ఈ సందర్భంగా గూడూరు 2వ పట్టణంలోని నిమ్మ మార్కెట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఆయన దిగగానే చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, వైయస్సార్‌సీపి నాయకులు మండల సురేష్‌బాబు ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువా కప్పగా, ఆ శాలువాను జగన్ సురేష్‌బాబుకు కప్పి అభినందించారు.

### ఉచితంగా కుట్టు శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ సి.రోహిణి

గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి ఈనెల 2న ఆంధ్రమహిళా మండలి ప్రాంగణంలో ఈ కోర్సులను ప్రారంభించారు. ఈ వేసవిలో మహిళలకు ఉచితంగా రెండు నెలల పాటు ఈ శిక్షణ ఇవ్వడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రమహిళామండలి అధ్యక్షురాలు కె.సీతారెడ్డి, కార్యదర్శి విష్ణువందన, ప్రతినిధులు జీవని, జమున, జయలక్ష్మి, సౌందర్యమ్మ, రమ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్

# ఫ్యాన్ కిందకు యస్.సి.వి

### - అభినందించి స్వాగతించిన జననేత



శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు ఆదివారం వైఎస్సార్సీపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపిలో చేరారు. గూడూరులో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని కలిసి ఆయన వైకాపాలో చేరారు. శ్రీకాళహస్తి నుంచి పెద్దఎత్తున వాహనాలతో గూడూరుకు తరలివెళ్ళారు. శ్రీకాళహస్తి వైకాపా అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌లు హెలిప్యాడ్ వద్ద జగన్‌కు స్వాగతం పలుకగా, వారిని జగన్ తమ వాహనంలో ఎక్కించుకుని ఎన్నికల ప్రచారసభ వేదిక వద్దకు వచ్చి, ఎస్‌సివి నాయుడుకు కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఆయనతో పాటు మరికొందరు ప్రముఖ నాయకులకు కూడా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా జగన్ ఎస్‌సివినాయుడును ఆలింగనం చేసుకుని అభినందించి మాట్లాడుతూ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి వైకాపా కృషి చేస్తుందన్నారు. దివంగత మహానేత డా.వైఎస్ హయాంలో ఎమ్మెల్యేగా మీరు చేసిన సేవ ఎనలేనిదని, మీ నాయకత్వంలో పార్టీ నాయకులను, కార్యకర్తలను నడిపించాలని అన్నారు. డ్వాక్రా మహిళలకు టిడిపి ప్రభుత్వం ఇచ్చింది రుణమాఫీ సొమ్ము మాత్రమేనని అంటూ, టిడిపి వంచన మాటలకు మహిళలు మరోసారి మోసపోవద్దని ఆయన కోరారు. రాజన్న రాజ్యం రావాలంటే జగనన్న పాలన రావాలన్నారు. వైకాపా అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, ఎస్‌సివి నాయుడుతో పాటు పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వైకాపాలో చేరడం ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి కూడా తన తండ్రి వైఎస్ లాగా పేదల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసుదేవనాయుడు, మోహన్‌నాయుడు, చిట్టివేలు జయగోపాల్, చంద్రయ్యనాయుడు, శ్రీకాళహస్వీశ్వర దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు లోకనాథం నాయుడు, నారాయణయాదవ్, కౌన్సిలర్లు జయ, సరోజనమ్మ, కిషోర్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# జనసందోహంతో కిక్కిరిసిన చంద్రబాబు సభలు

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్‌జనపథ్... సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, గులాంనబీ ఆజాద్, అహ్మద్ పటేల్, దిగ్విజయ్‌సింగ్, మనీష్ తివారి వంటి నాయకులున్నారు. వి. హెచ్. హనుమంతురావు అప్పుడే వంటింట్లో నుండి కాఫీ కప్పులతో వచ్చి అందరికీ ఇచ్చాడు. అందరూ కాఫీ తాగుతుండగా... సోనియా వుండి... దేశ వ్యాప్తంగా ఎన్నికల ట్రెండ్ ఎలావుంది అని అడిగింది. వెంటనే దిగ్విజయ్‌సింగ్ కలుగజేసుకుని... ఏం ట్రెండోనమ్మా... అంతా కొత్తగా చూస్తున్నాం, జనాలు తెలివి మీరిపోతున్నారు. జనాలకు తెలివితేటలొస్తే ఇక అసలు మనం గెలవగలమా? మన చేతికి అధికారం వస్తుందా? దేశ ప్రజలను గొర్రెలను చేసి 60ఏళ్లు పరిపాలించాం. ఇప్పుడు సెల్ ఫోన్‌లు, టీవీలు వచ్చి ప్రజల్లో తెలివి తేటలు పెంచాయి. మన పార్టీ గురించి జనానికి నిజాలు తెలుస్తున్నాయి. మధ్యలో ఈ రిలయన్స్ వాళ్ళ జియో నెట్‌వర్క్ ఒకటి... వాళ్ళ వల్ల పల్లెటూర్లలో వాళ్ళు కూడా చెడిపోయి మన పార్టీని అసహ్యించుకుంటున్నారు. ఈ టెక్నాలజీ ఇలాగే పెరిగి జనాలకు మన గురించి పూర్తిగా తెలిస్తే మీరు ఇటలీకి పోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. అందుకు సోనియా... దీనికి పరిష్కారం లేదా? అని అడిగింది. అందుకు దిగ్విజయ్... వుంది, మనం పొరపాటున ఈసారి అధికారంలోకి వస్తే ముందు రిలయన్స్ జియో నెట్‌వర్క్‌ను రద్దు చేయాలి, సెల్‌టవర్లు కూల్చేయాలి. టీవీలలో దూరదర్శన్ ఛానల్ మాత్రమే వచ్చేలా చేయాలి. సెల్ కంపెనీలు రద్దు చేసి బిఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్‌లకు మళ్ళీ ప్రాణం పోయాలి. ఫోన్ చేయాలంటే ప్రజలు ఎస్‌టిడి బూత్‌లకు పరుగులు తీసేలా చెయ్యాలి. ప్రతి గ్రామానికి రోడ్లు లేకుండా, రవాణా లేకుండా చేయాలి, ఎడ్లబండ్ల మీద మళ్ళీ తిరగాలి. మనం ఇచ్చిన బియ్యం, కిరోసిన్, ఉప్పు, పప్పు లాంటివి తీసుకుని ప్రజలు బ్రతకాలి. అప్పుడే కాంగ్రెస్‌కు పాత వైభవం వస్తుందని చెప్పాడు. ఈసారి మన ప్రభుత్వం వస్తే అలాగే చేద్దామని సోనియా చెబుతుండగా, బయట నుండి 'అమ్మా' అనే పిలుపు వినిపించింది. సోనియా అటు చూసింది. అక్కడ ఓ నడివయసు యువతి... ముఖమంతా నల్లగా మట్టి గొట్టుకుపోయి, చింపిరి చింపిరి జుట్టుతో బట్టలు మాసిపోయి వుంది. ఆమెను చూసి సోనియా విసుగ్గా... ఈ అడుక్కునే వాళ్ళకు వేళాపాళా లేదు... మంచి బిజీలో వున్నప్పుడే వచ్చి డిస్టర్బ్ చేస్తుంటారు అంటూ... హనుమాన్‌జీ బయట అడుక్కునే వాళ్లొచ్చారు... ఒక చపాతి తెచ్చి ఇవ్వు అని కేకేసింది. అది విని బయట వున్న యువతి... అమ్మా... నేను ప్రియాంకను అని అరిచింది. ఆ మాట విని సోనియా ఆశ్చర్యంతో ఆమె వద్దకు పరుగు పెట్టింది. తీక్షణంగా చూసింది. నిజమే తన బిడ్డ ప్రియాంక గాంధీనే. ఏంది తల్లీ ఇట్లా అయ్యావు అని బాధగా అడిగింది. దానికి ప్రియాంక... ఇట్లాగాక ఇంకెట్లా అవుతారు? మీ కొడుకును కాదని నన్ను ప్రచారానికి తిప్పుతుంటివి... ఈ ఎండలకు మాడిమసైపోయాను అంటూ ఏడవసాగింది. సోనియా ఆమెను ఓదార్చి... లోపలకెళ్లి స్నానం చేసిరాపో, భోజనం చేద్దువు అని చెప్పి పంపింది. అంతలో అక్కడకు హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు వచ్చాడు. సోనియా ఆయనను కూర్చోబెట్టి... చంద్రబాబుజీ మీ రాష్ట్రంలో పరిస్థితి ఎలా వుంది అని అడిగింది. అందుకాయన... వై.యస్. చనిపోయాక ఆ జగన్‌ను సీఎం చేసుండాల్సింది. మీరు ఆ పని చేయకపోబట్టి ఇప్పుడు వైసిపి రూపంలో నాకు చుక్కలు చూపిస్తున్నాడు. అతని ప్రచారం ముందు మేము చాలడం లేదు. స్టార్ క్యాంపెయినర్లు కావాలి... అని అన్నాడు. మరి రాహుల్‌ను పంపమంటావా అని సోనియా అడిగింది. ఎందుకు... మా లోకేష్‌తోనే మేం తల బొప్పికట్టి చస్తున్నాం, మళ్ళీ ఇంకో తలనొప్పి ఎందుకు అని ప్రశ్నించాడు. అలాగైతే ఇంకెవరి చేత ప్రచారం చేయిస్తారని సోనియా అడిగింది. అందుకు చంద్రబాబు... మన మిత్రపక్ష నేతలైన ఫరూక్ అబ్దుల్లా, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, స్టాలిన్‌లను ఆంధ్రాకు తీసుకుపోయి ప్రచారం చేయిస్తానని అన్నాడు. గుడ్... ఇంకా అవసరమైతే చెప్పండి... పాకిస్థాన్, ఇటలీ వాళ్లను కూడా రంగంలోకి దించుతామని సోనియా అంది. అవసరమైతే చెబుతాలే మేడం అంటూ చంద్రబాబు అక్కడ నుండి లేచాడు.

★★★★★

ఉండవల్లిలోని తన ఇంట్లోని గదిలో చంద్రబాబు దిగాలుగా కూర్చుని వున్నాడు. ఎదురుగా టిడిపి నాయకులు దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, మాగంటి మురళీమోహన్, కళా వెంకట్రావ్‌లు వున్నారు. ఏం సార్, అంత బాధగా వున్నారని పుల్లారావు అడిగాడు. చంద్రబాబు ఉండి... మనం ఫరూక్ అబ్దుల్లా, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్‌లను తీసుకొచ్చినా జనం రావడం లేదు. ఆ జగన్ సభలకేమో తండోప తండాలుగా వస్తున్నారని, ఎందుకిలా జరుగుతోందని ప్రశ్నించాడు. అప్పుడే ఇంట్లో నుండి మంగళగిరి ప్రచారానికిపోతున్న లోకేష్ ఆ మాటలు విన్నాడు. తన తండ్రి మాటల్లోని బాధను అర్థం చేసుకున్నాడు. వెంటనే లోకేష్ ఆ గదిలోకి వెళ్ళి... డాడీ నో వర్రీ... మన సభలకు జనం రావడం లేదనేగా మీ బాధ... రేపట్నుండి మీ సభలు చూడండి... జన సందోహంతో కిక్కిరిసిపోతాయి అని గట్టిగా చెప్పేసి వెళ్ళిపోయాడు. లోకేష్ మాటలతో చంద్రబాబులో ఏదో తెలియని ధైర్యం వచ్చింది.

★★★★★

పక్కరోజు చంద్రబాబు ప్రచారంలో భాగంగా నెల్లూరు వెళ్లాడు. అప్పటికే సభా ప్రాంగణం వేలాది జనంతో కిక్కిరిసిపోయింది. అప్పటికే స్టేజీ మీద ప్రియాంక చోప్రా, సోనాక్షిసిన్హా, దీపికా పదుకొనే వంటి బాలీవుడ్ భామలు, హంసా నందిని, కాజల్, అనుష్క వంటి తారల నృత్యాలతో అనసూయ, రష్మి, శ్రీముఖి వంటి యాంకర్ల వ్యాఖ్యానాలతో ఆ ప్రాంతం రచ్చరచ్చగా వుంది... జనాల కేరింతలతో మార్మోగుతోంది. అందరి నోట లోకేష్ జిందాబాద్ అనే నినాదాలు... మంత్రి నారాయణ ఆ జనం మధ్యలో నుండి బలవంతంగా స్టేజీ మీదకు చేరుకుని మైకు పట్టుకుని... ఇప్పటివరకు మన తారల నృత్యాలు చూసి ఆనందించారు... ఇప్పుడు మన ప్రియతమ నాయకుడు చంద్రబాబునాయుడు స్పీచ్ విని తరించండని కోరాడు. వెంటనే జనంలో నుండి... "చంద్రబాబు స్పీచ్ వద్దు... ప్రియాంక స్టేజీ షోలే మాకు ముద్దు" అనే స్లోగన్‌లు మొదలయ్యాయి. క్రింద నుండి అది విని చంద్రబాబు... లోకేషా... మన సభలకు జనాన్ని తండోపతండాలు తీసుకొస్తానంటే.. ఏదో అనుకున్నాను, ఇలా తీసుకొస్తావనుకోలేదని మనసులో అనుకుంటూ తల పట్టుకున్నాడు.

# మండే సూర్యుడు..



## అల్లాడుతున్న జిల్లా ప్రజానీకం..

మండుతున్న సూర్యుడు ధాటికి జిల్లా ప్రజానీకం అల్లాడుతున్నారు. ఒకప్రక్క రాజకీయ ప్రచార వేడి రోజురోజుకు ఎక్కువవుతుంటే తట్టుకుని పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమాల్లో దూసుకుపోతున్నారు. గత నెల చివరి వారంలో ఎండ తీవ్రత ఎక్కువైంది. ఒక్క సారిగా 2.5 డిగ్రీలు పెరిగాయి. గత నెల 27వతేది 37డిగ్రీలు, 28న 36.8 డిగ్రీలు, 29న 36.5 డిగ్రీలు, 30న 38.5 డిగ్రీలు, 31న 41 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇళ్ళ నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. రూరల్ పరిసర ప్రాంతాల్లో అప్పుడప్పుడు కరెంట్ పోవడం వల్ల ఉక్కపోతకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. చంటిబిడ్డలు, చిన్నపిల్లల గురించి ఇక చెప్పనవసరం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 3 నుండి 4 డిగ్రీలకు పైగా అధికంగా గ్రీష్మతాపం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్తోంది. మార్చి నెల నుండే ఎండ తీవ్రత ఎక్కువైంది. ఈ నెలాఖరులోగా ఎండ తీవ్రత ఎక్కువయ్యే అవకాశం వుందని, వాతావరణంలో వచ్చిన మార్పులు వల్ల ఉష్ణో గ్రతలు అధికమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయం 8గంటల నుండే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం 5 గంటల దాకా ఎండలు తగ్గడం లేదు. జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నయోదు అయ్యే అవకాశం ఉందని ప్రజలు అప్ర మత్తంగా వుండాలని వాతావరణ శాఖ, విపత్తుల నివారణ సంస్థ అధికారులు చెబుతున్నారు. ఎండలో బయటకు వెళ్ళాల్సి వస్తే గొడుగు గాని, టోపిగాని ఉపయో గించాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. మంచి నీళ్ళు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.


ఎక్కడున్నావు సోదరా...?



మేడా అశోక్‌కుమార్‌రెడ్డి

జననం: 20.12.1958 మరణం: 08.04.2018

నీ మాటలు వినపడుతూనే వున్నాయి
నీ నవ్వులు మాలో మెదులుతూనే వున్నాయి
నీ జ్ఞాపకాలు మా మదిలో పదిలంగానే వున్నాయి
ఎక్కడున్నావు సోదరా...?

నీ స్మృతులలో...

పుచ్చలపల్లి విజయకుమార్‌రెడ్డి (ఇంగ్లీష్)
నెల్లూరు.

# కల్యాణ వైభవం...!




నెల్లూరులో ఎస్.ఐ గాను, రాష్ట్రంలో పలు చోట్ల సి.ఐగాను పని చేసి ప్రస్తుతం డిఎస్‌పిగా సేవలందిస్తూ... పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులుగా అందరికీ సుపరిచితుడైన రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి సోదరుడు రామిరెడ్డి విజయభానురెడ్డి - లేట్ కల్పనల కుమార్తె **మౌనిక - సందీప్‌రెడ్డి** (చెన్నై వాస్తవ్యులు వి.పి.శ్రీధర్‌రెడ్డి - సుధల కుమారుడు)ల కల్యాణం మార్చి 22వ తేదీ నెల్లూరులోని అనిల్ గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.




వెంకటగిరి మండలం పాలకొండ వాస్తవ్యులు నక్కల గురుశేఖర్‌బాబు - కళ్యాణిల కుమారుడు **కృష్ణప్రతాప్ - స్వాతి** (నెల్లూరు వాస్తవ్యులు బర్రి బాలఅంకయ్య - కృష్ణవేణిల కుమార్తె)ల వివాహం మార్చి 21వ తేదీ నెల్లూరులోని ఏ.పి.టూరిజం హోటల్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.

# పవనే.. ముంచబోతున్నాడా?

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కళ్యాణ్ కూడా అరమరికలులేకుండా తెలుగుదేశానికే అప్పుడు ఓట్లేయమన్నాడు. ఆయనను అభిమానించేవాళ్ళు గాని, సొంత సామాజికవర్గం వాళ్ళు గాని తెలుగుదేశంకే మద్దతునిచ్చారు. కాబట్టే ఆ ఎన్నికల్లో కృష్ణా జిల్లా నుండి శ్రీకాకుళం జిల్లా వరకు మొత్తం ఆరు జిల్లాల్లో తెలుగుదేశం స్వీప్ చేసి అధికారంలోకి రాగలిగింది.

ఈ ఐదేళ్లలో పరిణామాలు మారాయి. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో చంద్రబాబు విఫలమయ్యాడు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది. ఈ పరిస్థితులను వూహించే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు విడిపోయినట్లుగా నటించసాగారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాల్సిన పవన్ పదేపదే ప్రతిపక్ష నేతను ప్రశ్నించడమే పనిగా పెట్టుకున్నాడు. ఓ పక్క టిడిపితో విభేదిస్తున్నట్లు నాటకాలాడుతూనే వైకాపాకు లబ్ధి చేకూరకుండా చేయాలనుకున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఉమ్మడి ప్రణాళిక ప్రభుత్వ వ్యతిరేక ఓటు వైసిపికి పోకుండా పవన్ కళ్యాణ్ జనసేనకు డైవర్ట్ చేయడం. ఈ ప్లాన్ అమలులో భాగంగానే జనసేన, బిఎస్పీ, వామపక్షాలతో కూటమి కట్టించాడు. ముఖ్యంగా కృష్ణ, ఉభయగోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో జనసేన అభ్యర్ధులను ఎక్కువుగా నిలబెట్టారు. అంటే ఇక్కడ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి తెలుగుదేశమన్నా గెలవాలి, లేదంటే జనసేన అభ్యర్థులన్నా గెలవాలి. ఎవరు గెలిచినా ఒకటే.! దీనికితోడు కొంత తెలుగుదేశం, వైసిపి ఓట్లు కూడా పవన్‌కళ్యాణ్‌కు పోతాయని, కొన్ని సీట్లలో అయినా జనసేన గెలుస్తుందని, తద్వారా వైసిపి గెలవకుండా చేయొచ్చని అంచనా వేశారు.

అయితే చంద్రబాబు అనుకున్నదొక్కటైతే, ఇప్పుడు జరుగుతున్నదొకటి. పవన్ విషయంలో ఏదైతే ఆశించారో అది పూర్తిగా రివర్స్ అయ్యింది. చంద్రబాబు, పవన్ వేర్వేరు కాదని, వీళ్ళిద్దరూ ఒకటేనన్న విషయం జనానికి అర్థమైపోయింది. జనసేనకు ఓటేయడమంటే మళ్ళీ చంద్రబాబుకు మద్దతివ్వడమేనని పవన్ సానుభూతిపరులు తెలుసుకున్నారు. అందుకే చంద్రబాబును వ్యతిరేకించే వాళ్ళంతా పవన్‌ను నమ్ముకోకుండా వైసిపికి మద్దతుదారులుగా మారిపోయారు. గోదావరి, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఇతర పార్టీల నుండి వైసిపిలోకి భారీ ఎత్తున వలసవచ్చిన నాయకులే దీనికి ఉదాహరణ. జనసేన ఈ ఎన్నికల్లో బలమైన తృతీయ శక్తిగా వుండుంటే చంద్రబాబు ఓటు చీలిక పాచిక పనిచేసుండేది. కాని, వీరి ప్లాన్ తెలిసి ఆ జిల్లాల్లో తెలుగుదేశాన్ని వ్యతిరేకించే నాయకులంతా కూడా ప్రత్యామ్నాయ శక్తిగా వున్న వైసిపిలో చేరిపోయారు. ఆ జిల్లాల్లో వైసిపి బలమైన శక్తిగా మారింది.

ఇప్పుడు పవన్‌తోటి ఎవరన్నా వున్నారు అంటే... అతను ఎక్కడ దూకమంటే అక్కడ దూకే అభిమానులే! ఈ ఎన్నికల్లో తెలుగుదేశానికే ఓటెయ్యాలని చెబితే వాళ్ళు అలాగే వేస్తారు. పవన్‌ను చంద్రబాబు ఇంకోసారి ఈ విధంగా వాడుకుని వుండొచ్చు. సీక్రెట్ పొత్తు కాకుండా పబ్లిక్‌గానే పొత్తుపెట్టుకుని వున్నా అభిమానుల ఓట్ల రూపంలో కొంత ఉపయోగం వుండేది. కాని, ఇప్పుడు పవన్ మూలంగా చీలేది ఆయన అభిమానుల ఓట్లే... దీనివల్ల తెలుగుదేశానికి నష్టమేగాని లాభం లేదు.



## బాబు ప్రచారం...

# గెలుపు బాటలు వేసేనా?

ఎన్నికల భేరీ మోగాక జిల్లా తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తరపున ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడే ఎక్కువ ప్రచారం నిర్వహించారు. గతంలో నెల్లూరు నగరం, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాలలో ప్రచార సభలు నిర్వహించిన చంద్రబాబు ఈ నెల 2వ తేదీ సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరులో నిర్వహించిన సభలోనూ, అలాగే నెల్లూరురూరల్ నియోజకవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలోనూ పాల్గొన్నారు. కస్తూరిదేవి గార్డెన్స్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. జిల్లాలో రెండు ఎంపీ సీట్లను, 10 అసెంబ్లీ స్థానాలను గెలిపించాలని వారిని కోరారు. 3వ తేదీ ఆత్మకూరు, దుత్తలూరులలో ఏర్పాటు చేసిన ప్రచార సభలలో పాల్గొన్నారు.

చంద్రబాబు సభలకు జనాన్ని బలవంతంగా తోలారన్నది వచ్చిన వారి పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. ఇక ప్రసంగాలలో మార్పులేమన్నా వున్నాయా అంటే అదీ లేదు. నరేంద్ర మోడీ... కేసీఆర్... జగన్‌లను తిట్టడమే! ఈ ప్రచార సభల్లో ఆయన ఎక్కువుగా చేసిందిదే! బోనస్‌గా వైసిపి ఎంపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని తిట్టడం. ఇందిరాగాంధీ నుండి నేటి రాహుల్‌గాంధీ దాకా అందరితో పోరాడానని ఈ జగన్ నాకొక లెక్కకాదని చెప్పుకోవడం.. బాబు ప్రచారంలో ప్రధానాంశాలు. మరి బాబు గారి ప్రచారం జిల్లాలో తెలుగుదేశం అభ్యర్థులకు ఏమేరకు ఉపయోగపడనుందో చూడాలి!

# ఓటమి భయమా?

(మొదటి పేజీ తరువాయి)

వెకిలిగా మాట్లాడుతున్నాడు. ప్రసంగాల మధ్యలో నిరాశకు గురవుతున్నాడు. ప్రజలను బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నాడు. అన్నింటికంటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తున్నాడు. ఈ రాష్ట్ర రాజకీయాలతో ఏ సంబంధం లేని కేసీఆర్ పేరును పదేపదే కలవరిస్తున్నాడు. ప్రధాని నరేంద్ర మోడీని ఉగ్రవాదితో పోలుస్తున్నాడు. ఇవన్నీ కూడా ఆయనలో కనిపిస్తున్న ఓటమి భయం తాలూకు పరిణామాలే!

## బలహీన అభ్యర్థులకే భయపడ్డాడా...?

ఈ నలభై ఏళ్ళ అనుభవజ్ఞుడు ఓటమి భయంతో ఏ స్థాయికి దిగజారిపోయాడనడానికి ఓ చిన్న ఉదాహరణగా... హిందూపురం వైసిపి ఎంపీ అభ్యర్థి గోరంట్ల మాధవ్ నామినేషన్ విషయంలో ఈ ప్రభుత్వం అనుసరించిన విధానం గురించి చెప్పుకోవచ్చు. మాధవ్ ఒక సిఐగా పని చేస్తూ విఆర్‌ఎస్ తీసుకున్నాడు. హిందూపురం నుండి వైసిపి ఎంపి అభ్యర్థిగా నిలబడుతున్న బలహీనవర్గాల వ్యక్తి. అతనిని నామినేషన్ వేయకుండా చూడడానికి చంద్రబాబు నానా తంటాలు పడ్డాడు. అంటే ఒక్క సి.ఐ స్థాయి అధికారి కోసం ఇంతగా భయపడాల్నా? 2009 ఎన్నికలప్పుడు డిజిపిగా వున్న ఎస్ఎస్‌పి యాదవ్‌ను మార్చాలంటూ చంద్రబాబు ఎన్నికల కమిషన్‌ను కోరాడు. అప్పుడు ఎన్నికల కమిషన్ చంద్రబాబు కోరినట్లే యాదవ్ స్థానంలో మహంతిని డిజిపిగా పెట్టింది. అప్పుడేమో ఎన్నికల కమిషన్ చేసిన పని చంద్రబాబుకు సూపర్ అనిపించింది. మరిప్పుడు ప్రతిపక్షంగా వున్న వైసిపి డిజిపితో పాటు ఇంటలిజన్స్ డిజి, పలువురు పోలీసు అధికారులను మార్చాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేయడం, ఇంటలిజన్స్ డిజిని, ఇద్దరు ఎస్పీలను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేయడం జరిగింది. అయితే ఈసీ ఆదేశాలనే ధిక్కరిస్తూ చంద్రబాబు హైకోర్టు కెక్కాడు. ఇంటలిజన్స్ డిజి ఎన్నికల పరిధిలోకి రాడంటూ జి.ఓ తెచ్చి, హైకోర్టు చేత మొట్టికాయలేయించుకున్నాడు. ఒక ఇంటలిజెన్స్ డిజి సహకారం లేకుంటేనే తాను గెలవలేననుకుంటున్నాడంటే చంద్రబాబులో ఏ స్థాయి భయం ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు.

## ఉత్తరాది నాయకులతో ప్రచారం దేనికి సంకేతం..?

ఓ పక్క ఆంధ్రాపై ఉత్తరాది వాళ్ళ పెత్తనం ఏందంటున్నాడు. పక్క రాష్ట్ర సీఎం కేసీఆర్‌కు మన రాష్ట్రంలో పనేంటంటున్నాడు. ఇంకో పక్క ఢిల్లీ, పశ్చిమబెంగాల్ సీఎంలను, కాశ్మీర్ పార్టీ నాయకులను తీసుకొచ్చుకొని ప్రచారం చేయించుకున్నాడు. ఇది దేనికి సంకేతం?

## ఒక్క సినిమాకే ఇంతగా దడుచుకోవాలా..?

చంద్రబాబులో భయం, అభద్రతా భావం తారాస్థాయికి చేరిందనడానికి ఇంకో ఉదాహరణ... 'లక్ష్మీస్ ఎన్టీఆర్' అనే సినిమా! తెలుగుదేశం పార్టీ పుట్టిందే సినిమా గ్లామర్ నుండి, చివరకు అదే పార్టీ ఓ చిన్న సినిమాను చూసి కూడా భయపడుతోంది. ఎన్టీఆర్, లక్ష్మీపార్వతిల అనుబంధాన్ని నేపథ్యంగా తీసుకుని దర్శకుడు రాంగోపాల్‌వర్మ నిర్మించిన 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాను రాష్ట్రంలో విడుదల కాకుండా అడ్డుకోవడానికి తెలుగుదేశం నాయకులు చేయని ప్రయత్నమంటూ లేదు. సెన్సార్ బోర్డ్ ద్వారా ఆపాలని చూశారు, ఎన్నికల సంఘం ద్వారా అడ్డుకోవాలనుకున్నారు... అవన్నీ కుదరక హైకోర్టు కెళ్ళారు. ఆ సినిమాను ఆంధ్రాలో విడుదల కాకుండా స్టే తెచ్చుకున్నారు. కాని, ఆ సినిమా తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలతో పాటు మిగతా రాష్ట్రాలలో కూడా విడుదలైంది. ఆ సినిమా చూసిన వాళ్లెవరు కూడా చంద్రబాబుకు ఓటెయ్యరంటున్నారు. ఆ సినిమాలో చంద్రబాబు పాత్రను అంత నెగటివ్‌గా చూపించారు. ఆంధ్రా థియేటర్‌లలో ఆ సినిమా విడుదల కాలేదన్న మాటేగాని, అందరి సెల్‌ఫోన్‌లకు లక్ష్మీస్ ఎన్టీఆర్ పూర్తి సినిమా వచ్చేసింది. సోషల్ మీడియా ప్రపంచాన్నే ఏలుతున్న కాలంలో ఆ సినిమాను ప్రేక్షకుల అరచేతుల్లోకి రాకుండా అడ్డుకోవడం ఎవరితరం. తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఇప్పుడు అనుభవిస్తున్న ఆందోళన, పడుతున్నంత భయం చంద్రబాబు గతంలో ఎప్పుడూ పడలేదు. ఈ భయంతోటే ఆయన ఒక తప్పు వెంట ఇంకో తప్పు చేస్తూ ఎన్నో సెల్ఫ్‌గోల్స్ వేసుకున్నాడు.

టెన్షన్.. టెన్షన్..

# ఇక 5 రోజులే...

ప్రచారంలో దూసుకుపోతున్న అభ్యర్థులు

దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు, అలాగే 4 రాష్ట్రాల అసెంబ్లీలకు ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా, తొలిదశలోనే ఏపిలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీలకు ఎన్నికలు పెట్టడం అభ్యర్థుల అదృష్టమనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఎంత తొందరగా ఎన్నికలు అయిపోతే అంత తొందరగా అభ్యర్థులు టెన్షన్ నుండి బయటపడతారు. ఖర్చులు తగ్గిపోతాయి. ఇక ఎన్నికలు ముగిసాక, కౌంటింగ్‌కు 43రోజుల పాటు వేచి చూడక తప్పదు.

ఎన్నికలకు ఇక ఐదు రోజుల దూరంలో వున్నాము. గతంలో ప్రచారానికి కనీసం నెలరోజుల గడువు దొరికేది. ఈసారి గట్టిగా రెండు వారాలు ప్రచారం చేసుకోగలిగారు. అది కూడా నామినేషన్‌లు పూర్తయ్యి, ఉపసంహరణలు జరిగాక పదిరోజులే గడువు. అప్పటికే అభ్యర్థులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రచారం విషయంలో వైసిపి అభ్యర్థులు ముందు వరుసలో వున్నారు. ఎందుకంటే వాళ్ళీరోజు కొత్తగా ప్రజల ముందుకు పోయింది కాదు. 2014 ఎన్నికల తర్వాత నుండి కూడా వైసిపి నుండి గెలిచిన ఎమ్మెల్యేలు గాని, ఓడిపోయి ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్న నాయకులు గాని ప్రజాదీవెన, ప్రజా ప్రస్థానం వంటి కార్యక్రమాలతో ఎప్పుడూ ప్రజల మధ్యే తిరుగుతున్నారు. నెల్లూరు నగరంలో పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలిలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి గత ఐదేళ్ళుగా ప్రజల మధ్యే తిరుగుతూ వచ్చారు. ఈ విషయంలో ఆత్మకూరు వైసిపి ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి వెనుకబడడం వల్ల నియోజకవర్గంలో కొంత వ్యతిరేకత తెచ్చుకున్నాడు. ఉదయగిరి ఇన్‌ఛార్జ్‌గా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోవూరు ఇన్‌ఛార్జ్‌గా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు ఐదేళ్ళుగా ప్రజల్లో వున్నోళ్ళే! వైసిపిలోకల్లా గూడూరుకు వరప్రసాద్, వెంకటగిరికి ఆనం రామనారాయణరెడ్డి కొత్త అభ్యర్థులు. అయితే వీరికి కూడా సమస్య లేదు. గత ఐదేళ్ళ కాలంలో తిరుపతి ఎంపి అభ్యర్థిగా వరప్రసాద్ గూడూరు ప్రజలకు సుపరిచితుడే! ఇక వెంకటగిరిలో ఆనం రామనారాయణరెడ్డి కొన్ని నెలల క్రితమే ప్రచారంలోకి దిగినా అందరి కంటే కూడా వేగంగా దూసుకుపోయాడు. ఇక నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశం నుండి అకస్మాత్తుగా వైసిపిలో చేరినా, ఆయన స్టైల్ ప్రచారం ఆయన చేసుకుపోతున్నాడు. ఆదాల జిల్లా అంతా పరిచయం వున్న నాయకుడు కాబట్టి ఆయన గురించి ప్రచారం చేయాల్సిన పని కూడా లేదు.

ప్రచారం విషయంలో తెలుగుదేశం అభ్యర్థులే చాలావరకు వెనుకబడ్డారని చెప్పవచ్చు. నెల్లూరు నగరంలో ఇంతకాలం మంత్రిగా నారాయణ తిరుగుతున్నా, ఆయనెప్పుడూ ఎన్నికల అభ్యర్థిగా ప్రచారంలో లేడు. ప్రజల ముందుకు వెళ్ళింది చాలా తక్కువ. ఇప్పుడు నగర టిడిపి అభ్యర్థిగా ప్రచారంలో ప్రజల ముందుకు వెళ్ళడానికి ఆయనకున్న సమయం చాలా తక్కువ. ఈ కొద్ది సమయంలో ఆయన ఎంత ప్రచారం చేయగలడు. ఎంతమందిని కలవగలడు. నెల్లూరురూరల్ అభ్యర్థి అజీజ్ పరిస్థితీ అదే! ఆయన అనుకోకుండా అభ్యర్థి అయ్యాడు. ప్రజల్లోకి పోవడానికి నానా తంటాలు పడుతున్నాడు. సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ విషయంలో అందరికంటే బెటర్. 2014లో ఓడినా కూడా ఆయన ఈరోజుకీ ప్రజల మధ్యే వుంటున్నారు. వెంకటగిరి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, కోవూరు అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి బొల్లినేని రామారావులు ముగ్గురూ సిటింగ్ ఎమ్మెల్యేలే! గత ఐదేళ్ళుగా వీరు తమతమ నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. అయితే వీళ్ళ మీద నియోజకవర్గాలలో వున్న వ్యతిరేకత పార్టీపై ఈసారి ప్రభావం చూపే అవకాశముంది. ఆత్మకూరు అభ్యర్థిగా బొల్లినేని కృష్ణయ్యను కొన్ని రోజుల క్రితమే సీన్‌లోకి తెచ్చారు. కావలిలో అయితే వైసిపి నుండి వచ్చిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని అభ్యర్థిని చేసిపెట్టారు. తెలుగుదేశం శ్రేణులు ఆయనతో ఎంతవరకు కలుస్తారో చూడాలి!? అనేక సంశయాల మధ్య సూళ్ళూరుపేట మళ్ళీ పరసా రత్నంనే పెట్టారు. ఈయన కూడా ప్రచారంలో వెనుకబడి వున్నాడు. వైసిపి నుండి జంప్ చేసిన ఎమ్మెల్యే సునీల్ గూడూరు తెలుగుదేశం అభ్యర్థి. ఈయనపై వున్న వ్యతిరేకత పార్టీపై పడొచ్చు. ఐదేళ్ళుగా కావలిని కనిపెట్టుకుని వున్న బీద మస్తాన్‌రావును పార్లమెంటు అభ్యర్థిగా పెట్టారు. బీసీ వర్గాల అభ్యర్థిగా ఆయన ప్రచారంలో వూపుతెచ్చాడు.

ఇక జిల్లాలో జనసేన ఆనవాళ్ళు నెల్లూరుసిటీ, రూరల్, కావలి నియోజకవర్గాలలో కనిపిస్తున్నాయి. బీజేపీ అభ్యర్థులు నెల్లూరు లోక్‌సభతో పాటు 5 అసెంబ్లీలకు పోటీ చేస్తున్నా, వారి ప్రభావం అంతంత మాత్రంగానే వుంది. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం కూడా చప్పగానే సాగుతోంది.


కోవూరు ప్రచారంలో చిన్నారితో ప్రసన్న, ఆదాల


నెల్లూరు బార్ అసోసియేషన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల, అనిల్


సర్వేపల్లిలో సోమిరెడ్డి, పనబాకలకు మహిళల మంగళహారతి


నెల్లూరురూరల్‌లో వృద్ధురాలుతో అబ్దుల్‌అజీజ్ మాటామంతీ


కావలి ప్రచారంలో రామిరెడ్డి ప్రతాప్


నెల్లూరురూరల్‌లో జనసేన అభ్యర్థి మనుక్రాంత్ చెన్నారెడ్డి

# ఆకట్టుకున్న.. "అమ్మ" ఫర్నిచర్ ప్రదర్శన



"అమ్మ ఫర్నిచర్ మాల్" అంటే నెల్లూరు జిల్లాలో తెలియని వారు లేరు. ఫర్నిచర్ రంగంలో తమ ప్రత్యేకతను చాటుకుంటూ మారుతున్న కాలంతో పాటు అందుబాటులోకి వస్తున్న సరికొత్త మోడళ్ళ ఫర్నిచర్‌ను నెల్లూరీయులకు చేరువ చేస్తూ తమ కస్టమర్ల మనసులు దోచుకున్న సంస్థ 'అమ్మ ఫర్నిచర్ మాల్'. ప్రతి ఏడాదిలాగే "ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పో-2019"ని ఈ ఏడాది కూడా మార్చి 29 నుండి ఏప్రియల్ 3వ తేదీ వరకు నెల్లూరు మినీబైపాస్‌లోని జిపిఆర్ గ్రాండ్‌లో నిర్వహించి వేలాది రకాల ఫర్నిచర్‌ను నెల్లూరులో ప్రదర్శించి ఔరా అనిపించారు సంస్థ నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, సుజన్‌రెడ్డి, సుమన్‌రెడ్డిలు.

ఇటలి, ఇండోనేషియా, బెల్జియం దేశాలతో పాటు ఫర్నిచర్ తయారీలో ప్రఖ్యాతిగాంచిన పలు దేశాల నుండి ఫర్నిచర్‌ను దిగుమతి చేసుకుని దిగువ మధ్య తరగతి కుటుంబాల వారికి అవసరమైన అన్ని రకాల ఫర్నిచర్‌తో పాటు ధనికులకు అవసరమైన విలాసవంతమైన ఖరీదైన ఫర్నిచర్‌ని కూడా ఈసారి ప్రదర్శనలో ఉంచారు. 5రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శన సందర్శకులతో క్రిక్కిరిసిపోయింది. నెల్లూరులో ఫర్నిచర్ అంటే ముందుగా గుర్తొచ్చే స్థాయికి అమ్మ ఫర్నిచర్ మాల్‌ను తీర్చిదిద్దిన నిర్వాహకులకు 'లాయర్' అభినందనలు.



# ఆఖరి పోరాటం

2019 ఎన్నికలలో జిల్లాలో కొంతమంది నాయకులు రిటైర్మెంట్ ప్రకటించినట్లయ్యింది. వాళ్ళల్లో సీనియర్ మేకపాటి రాజమోహన్‌రెడ్డి. ఇక వయసు రీత్యా భవిష్యత్‌లో కూడా ఆయన పోటీ చేసే అవకాశాలుండవు. అలాగే కొమ్మి లక్ష్మయ్య, కంభం విజయరామిరెడ్డి వంటి నాయకులకు భవిష్యత్‌లో ఎన్నికల్లో పోటీకి అవకాశం రాకపోవచ్చు. నెలవల సుబ్రహ్మణ్యం ఇదే ఖాతాలోకి వస్తాడు. మాజీఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్రకు కూడా ఇక భవిష్యత్‌లో పోటీ చేసే అవకాశాలు రాకపోవచ్చు.

అలాగే 2019 ఎన్నికలు ఇంకొంతమంది నాయకులకు ఆఖరి పోరాటం కానున్నాయి. ఇప్పుడు గెలిస్తేనే వీరికి భోగం, లేదంటే గృహ యోగమే! ఈ లిస్టులో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని రామారావు వంటి నాయకులు వున్నారు.

## ఒక్క అవకాశమివ్వండి...

# రాజన్న రాజ్యం తెస్తా...

**- నెల్లూరు సభలో జగన్**







నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి అనిల్‌లను గెలిపించాలని కోరుతున్న వై.యస్.జగన్, సభకు హాజరైన జనసందోహం.

అక్కల్లారా... చెల్లెమ్మల్లారా... అన్నయ్యల్లారా... అవ్వల్లారా... ఒక్క అవకాశమివ్వండి... మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేయండి... ఆ ప్రియతమ నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి పరిపాలనను, ఆయన స్వర్ణయుగాన్ని మళ్ళీ తీసుకువస్తానని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఉదయం 9.30గంటలకే ఈ రోడ్డు జనంతో నిండిపోగా, జగన్ 12గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. నడినెత్తిన సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నా జనం కదల్లేదు. సభా ప్రాంగణానికి జగన్ చేరుకోగానే అభిమానుల కేరింతలతో మార్మోగిపోయింది. సభకు హాజరైన అభిమానులనుద్దేశించి జగన్ మాట్లాడుతున్నంత సేపు సభలో హర్షధ్వానాలు మిన్నంటాయి. ముఖ్యంగా నెల్లూరులో అభివృద్ధి పనుల పేరుతో జరిగిన అవినీతిని తూర్పారబట్టారు. నెల్లూరు టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నారాయణ వల్లే చదువులు ఖరీదుగా మారాయని, ఆయన ధన దాహానికి ప్రభుత్వం కట్టించిన ఎన్టీఆర్ ఇళ్ళలో అవినీతే పెద్ద ఉదాహరణగా చెప్పారు. ఎంతమంచి ప్రాంతంలో ఇళ్ళు కట్టినా చదరపు అడుగు వెయ్యి రూపాయలకు మించదని, కాని ప్రభుత్వం ఇచ్చిన ఉచిత స్థలంలో సబ్సిడీ సిమెంట్‌తో కట్టిన ఎన్టీఆర్ ఇళ్లను చదరపు అడుగు 2వేల రూపాయలకు లబ్దిదారులకు అమ్ముకోవడం దారుణమని విమర్శించారు. దేవుడు ఆశీర్వదించి ప్రజలు ఆదరిస్తే మన ప్రభుత్వం వచ్చాక ఆ ఇళ్ళపై వున్న ఋణాలన్నీ మాఫీ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలుగుదేశం నాయకులు, పచ్చమీడియా వాళ్ళు మార్ఫింగ్ వీడియోలతో నెల్లూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని, దమ్ముంటే నిజాయితీగా రాజకీయాలు చేయాలని అన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు ఎంతో మంచివాళ్ళని, మీకు సేవ చేస్తారని, వారిద్దరినీ గెలిపించాలని ఆయన కోరారు. జగన్ ఫ్యాన్ గుర్తును అందరికీ చూపుతూ సరిగ్గా వచ్చే గురువారం ఇదే రోజున చంద్రబాబు చీకటి పాలనకు తెరదించే యజ్ఞంలో మీరంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.


మరువలేను మిత్రమా...



మేడా అశోక్‌కుమార్‌రెడ్డి

జననం: 20.12.1958 మరణం: 08.04.2018

నీ కమ్మని మాటలను
నీ తియ్యని అనుభూతులను
నీతో గడిపిన క్షణాలను
నీ స్నేహ సౌరభాలను
మరువలేను మిత్రమా...

నీ జ్ఞాపకాలతో...
దువ్వూరు శివకుమార్‌రెడ్డి
నెల్లూరు.


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com